
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 88 | ది. 5-7-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 88 | Date : 5-7-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


# 'స్వర్ణ కుప్పం'కు నాంది

● రూ.118 కోట్లతో మోడల్ బస్ స్టేషన్, డిపోకు ముఖ్యమంత్రి శంకుస్థాపన ● కుప్పంలోనూ గోల్డ్ ఫీల్డ్స్..ఉద్యోగాలకు ఇక్కడికే రావాలి ● ప్రజలు అమరావతి అంటే.. గొడ్డలి పార్టీ మావిగన్ అంటోంది ● గత పాలకులు కుప్పంపై కక్షగట్టి... సినిమా సెట్టింగులతో డ్రామాలు ఆడారు ● 'సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసింది... ఇప్పుడు అభివృద్ధే అజెండా ● కుప్పం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు







**కుప్పం,జూలై 4 (వార్తాప్రభ) :** స్వర్ణ కుప్పం లక్ష్యంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కుప్పంలో రూ.118 కోట్లతో నిర్మించనున్న ఆధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపోకు శంకుస్థాపన చేసిన అనంతరం... అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. అభివృద్ధి అంశాలతో పాటు గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వివేకానందరెడ్డి హత్య నుంచి కోడికత్తి ఘటన, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అమరావతి రాజధాని, కుప్పం అభివృద్ధి వరకు గత ప్రభుత్వంలో జరిగిన విధానాలను ముఖ్యమంత్రి ఎండగట్టారు.

**ఉద్యోగాల కోసం కుప్పమే రావాలి..** ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అత్యాధునిక మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని చంద్రబాబు తెలిపారు. డిపోలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దే దిశగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని, ఉద్యోగాల కోసం కుప్పం ప్రజలు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... ఇతర ప్రాంతాల వారు కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఎంఓయూలు జరిగాయని, వాటి ద్వారా సుమారు 80 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరించారు. అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థ కోసం అనేక రాష్ట్రాలు పోటీ పడినా అది కుప్పాన్నే ఎంచుకుందని చెప్పారు. టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ పరిశ్రమతో పాటు డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు కూడా కుప్పానికి వచ్చాయని వెల్లడించారు

**కుప్పంలోనూ బంగారు గనులు..** కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించినట్లే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని చెబుతున్నారని, సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని అందుబాటులోకి తీసుకొచ్చి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతామని ప్రకటించారు. మైక్రో ఇరిగేషన్‌లో కుప్పం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్న సీఎం... రాష్ట్రానికి అది శ్రీరామరక్షగా మారిందన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి నీరు తీసుకొచ్చి 110 చెరువులు నింపామని చెప్పారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉద్యాన పంటలను ప్రోత్సహించి రాయలసీమను అభివృద్ధి చేస్తామని, వచ్చే నెలలో మదనపల్లెలో దానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కుప్పంలో రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా డెయిరీ రంగాన్ని విస్తరిస్తామని, వాణిజ్య పంటలకు పెద్దపీట వేస్తామని చెప్పారు.

**కాలుష్య రహిత కుప్పం నిర్మిద్దాం..** రాజధానిపై రోజుకో కొత్తమాట రాజధానిపై ప్రతిరోజూ కొత్త మాటలు మాట్లాడుతున్నారని, కేంద్రం చట్టం చేసిన తర్వాత రాజధానిని మార్చడం సాధ్యం కాదన్నారు. అమరావతి రాజధానిని తాము కోరుకుంటుంటే, వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలని గొడ్డలి పార్టీ మాట్లాడుతోందని విమర్శించారు. గొడ్డలి పార్టీ అని తాము చెప్పడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కుప్పాన్ని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని, ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు

● 322 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసిన సీఎం ● సామాజిక న్యాయంపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ముఖ్యమంత్రి వ్యాఖ్య ● ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాలు పరిష్కరిస్తాం ● అభివృద్ధి కోసం యజ్ఞం చేస్తుంటే... రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు : సీఎం చంద్రబాబు





**కుప్పం,జూలై 4 (వార్తాప్రభ) :** ఆరు దశాబ్దాలుగా భూమి కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామంలోని 322 కుటుంబాల నిరీక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెర దించారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములకు అధికారిక హక్కు పత్రాలు అందుకోవడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుప్పం నియోజకవర్గంలోని కంగుందిలో నిర్వహించిన డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 460.19 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 61 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా గ్రామస్థులను వేధిస్తున్న భూ సమస్యను సమగ్ర రికార్డుల పరిశీలన, వివిధ కోణాల్లో అధ్యయనం చేసి పరిష్కరించినట్లు తెలిపారు. అడవి పోరంబోకు భూమిని అసైన్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు భూములు అందించినట్లు చెప్పారు.

**పేదలకు పట్టాల పంపిణీ సంతోషంగా ఉంది..** రైతుల పక్షాన న్యాయం ఉండటంతోనే ఈ సమస్యను పరిష్కరించగలిగామని పేర్కొన్న సీఎం, 322 మంది రైతులకు 460.19 ఎకరాల భూమిని పట్టాల రూపంలో ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు. కంగుంది కోట సాక్షిగా రైతులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అనేక రెవెన్యూ, భూ సమస్యలు ఉన్నాయని, ఇటీవల శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి 90 ఎకరాల భూమి దక్కడంతో పాటు రైతులకు కూడా న్యాయం జరిగిందన్నారు. వట్టిచెరుకూరు గ్రామంలో వందల ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యను కూడా పరిష్కరించామని, ఇప్పుడు కంగుంది సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు.

**గూండాయిజానికి తావులేదు..** గత ప్రభుత్వ హయాంలో అనేక భూ వివాదాలు సృష్టించారని ఆరోపించిన సీఎం, ప్రజల పట్టాదార్ పాస్ పుస్తకాలపై గత పాలక పార్టీ నేతల ఫొటోలు ముద్రించారని విమర్శించారు. వాటిని తొలగించి రాజముద్రతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశామని చెప్పారు. భూ వివాదాల పరిష్కారంలో ఓపికతో వ్యవహరించి అన్ని రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భూములకు భద్రత కల్పించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా కూడా అనేక భూములు వివాదాస్పదమవుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, సోదరీమణుల హక్కులను గౌరవించాలని సూచించారు. రౌడీయిజం, గుండాయిజానికి రాష్ట్రంలో తావులేదని స్పష్టం చేసిన ఆయన, పెట్టుబడులు ఆకర్షిస్తూ పరిశ్రమలు తీసుకొస్తున్నామని, కుప్పంలోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. భవిష్యత్తులో కుప్పాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసి మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**అభివృద్ధిని ఆపలేరు... అడ్డుకోలేరు..** 'కుప్పం ప్రజలంతా సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్య మివ్వాలనీ సీఎం అన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగం బదులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఈ సైకిళ్లు, ఈ వెహికల్స్ వినియోగం పెంచాలనీ సూచించారు. నెట్ జీరో విధానంలో స్వచ్ఛ కుప్పం-స్వర్ణ కుప్పం సాధించాలనీ పిలుపు నిచ్చారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటికే 1.50 లక్షల మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దామని వివరించారు. డ్వాక్రా మహిళా ఉత్పత్తుల కోసం స్వయం బ్రాండ్ ఏర్పాటు చేశామని..దీని ద్వారా అంతర్జాతీయ స్థాయికి డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ వచ్చేలా చేస్తామని తెలిపారు.

# బియ్యం ఎగుమతుల్లో తెలంగాణను దేశంలో నంబర్-1గా తీర్చిదిద్దడమే లక్ష్యం

●ఆధునిక రైస్ మిల్లులే భవిష్యత్తుకు బాట ● బియ్యం ఎగుమతులు చేసే మిల్లులకు ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు ● మిర్యాలగూడలో రూ.150 కోట్లతో నిర్మించిన అత్యాధునిక బందారు అగ్రోటెక్ రైస్ మిల్లును ప్రారంభించిన మంత్రి ● మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 4 (వార్తాప్రభ) :** తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ బియ్యం ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక బందారు అగ్రోటెక్ రైస్ మిల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందని తెలిపారు. ఇకపై కేవలం ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, నాణ్యమైన బియ్యాన్ని దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.బియ్యం ఎగుమతులు చేసే రైస్ మిల్లులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీంతో మిల్లర్లు నాణ్యత పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, బ్రాండింగ్, ఎగుమతులపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సంప్రదాయ రైస్ మిల్లుల కాలం ముగుస్తోందని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన సమయం వచ్చిందని మంత్రి అన్నారు. ఆటోమేటిక్ యంత్రాలు, శాస్త్రీయ ధాన్యం ఆరబెట్టే వ్యవస్థలు, సైలోలు, నాణ్యత పరీక్షా పరికరాలు వంటి ఆధునిక సదుపాయాలతో మిల్లులను అభివృద్ధి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. "రైస్ మిల్లుల ఆధునికీకరణ ఇక ఎంపిక కాదు... కాలానుగుణ అవసరం" అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో ఉత్పత్తయ్యే బియ్యాన్ని కేవలం కేంద్ర ప్రభుత్వానికి సరఫరా చేయడమే కాకుండా, 'తెలంగాణ రైస్' పేరుతో దేశవ్యాప్తంగా, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అన్నారు. నాణ్యతతో కూడిన విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు, మిల్లర్లు, వినియోగదారులందరికీ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటికే 81 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థపై రైతులు ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ప్రాసెసింగ్ సాంకేతికత, మెరుగైన నిల్వ సదుపాయాలు, పంట అనంతర నష్టాల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. శాస్త్రీయ నిల్వ, సమర్థవంతమైన మిల్లింగ్, నాణ్యమైన బ్రాండింగ్ ద్వారా తెలంగాణ బియ్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ఆదరణ లభిస్తుందని చెప్పారు. మిర్యాలగూడలో అత్యాధునిక రైస్ మిల్లును ఏర్పాటు చేసిన బందారు అగ్రోటెక్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఇటువంటి పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు రైతులు పండించే ధాన్యానికి మరింత విలువ తీసుకువస్తాయని అన్నారు. రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అత్యాధునిక రైస్ మిల్లులో 35 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల ఆరు సైలోలు ఏర్పాటు చేశారు. గంటకు 16 టన్నుల బియ్యాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యం ఈ మిల్లుకు ఉంది. జపాన్‌కు చెందిన సటాకే ఆధునిక మిల్లింగ్ టెక్నాలజీ, ఆటోమేషన్ వ్యవస్థ, ఫోటాన్స్ ఇండస్ట్రీస్ ధాన్యం ఆరబెట్టే వ్యవస్థ, స్పెయిన్‌కు చెందిన సిమాగా స్టీల్ సైలోలతో ఈ మిల్లు అత్యాధునిక సాంకేతికతతో నిర్మించబడింది.

# 'వైట్ గట్'పై ప్రభుత్వం ఫుల్ అలర్ట్

● మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు
● రొయ్యల రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వం, అండగా ఉంటామని హామీ ఇచ్చిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, జూలై 4 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ఆక్వా ప్రాంతాల్లో రొయ్యలలో "వైట్ గట్" (White Gut) వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయనే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై, యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం మహదేవిపట్నంలో రైతు పి. మనోజ్ వర్మ చెరువును మత్స్యశాఖ అధికారులు పరిశీలించి, నీరు, రొయ్యలు, ఫీడ్, మల నమూనాలను సేకరించి పరీక్షల కోసం కైకలూరు ప్రయోగశాలకు పంపారని, నీటి నాణ్యత పరీక్షలను భీమవరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. జిల్లా జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఫీణాలు, AIFలు, VFAలు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లుగా పనిచేసి ప్రతి ఆక్వా ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని నమోదిత, నమోదుకాని హేచరీలు, ప్రైవేట్ ఆక్వా ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నాణ్యతలేని విత్తనం, నాసిరకం ఫీడ్ విక్రయాలు, తప్పుడు ల్యాబ్ నివేదికలు, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిపై చట్టపరంగా, శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువుల నుంచి రొయ్యలు, పోస్ట్ లార్వా (PL), ఫీడ్, నీరు, మల నమూనాలను తప్పనిసరిగా సేకరించి PCR పరీక్షలు నిర్వహించాలని ఆదేశించామని తెలిపారు.


### పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ టౌన్, బావాజీపేట, 1వ లైన్, శనగశెట్టి వారి వీధి, డోరు నెం.24-13-1 కాపురస్తురాలు తన్నీరు కోటేశ్వరరావు గారి కుమార్తె తన్నీరు దివ్యసాయి అను నా పేరిట విజయవాడలో ది.12-05-2022వ తేదీన నెం.వి9891656 గల ఒరిజినల్ పాసుపోర్టు మరియు కొన్ని కాగితములు కలిగి ఉన్నటువంటి ఫైల్‌ను బండికి తగిలించుకొని ది.29-06-2026వ తేదీన గాంధీనగర్ నుండి బావాజీపేటలోని మా ఇంటికి వెళ్లుచుండగా మార్గమధ్యంలో జారిపడిపోయినది. వెంటనే పాసుపోర్టు కలిగిన ఫైల్‌ను పరిసర ప్రాంతములో ఎక్కడ వెదకినను కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికిన యెడల నాకు తెలియ పరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 8247369218


● క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
● రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు
● ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి
● అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి



**హైదరాబాద్,జూలై 4 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని , ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలి. క్యూర్ పరిధిలో పేదల జీవ-నోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలి. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ ఒ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయి. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావం-ణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ ఒ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధం

–గిరిజన నాయకుడు ధారావత్ శ్రీను



**విస్సన్నపేట,జూలై 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తెల్ల దేవరపల్లి జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 3,349 ఉండగా పురుషులు 1,649 స్త్రీలు 1,700 కుటుంబాలు 877 ఉన్నాయి అని విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతోంది. తెల్ల దేవరపల్లిలో 0–6 వయసు పిల్లలు 303 మంది ఉన్నారు. మొత్తం 3,349 జనాభా కాగా 18 సుమారు 2,400 – 2,600 మంది ఓటర్లు రమారమి ఉన్నట్లు ఒక అంచనా అందుతోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్ గా ఆ రోజులలో 420 ఓట్లు మెజార్టీతో గెలిచి పనిచేయటం జరిగిందని పోల్ మేనేజ్మెంట్ పై అపారమైన పట్టు ఉండటం సమకాలీన రాజకీయ ఆర్థిక పరిస్థితులను అంచనా పై అవగాహన ఉన్నదని వైసీపీ అధిష్టానం ఆదేశిస్తే తాను ఎన్నికల కురుక్షేత్ర యుద్ధ రంగంలో దూకేందుకు సిద్ధంగా ఉన్న అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్, తిరువూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్టీ సీనియర్ నాయకులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, మండల స్థాయి జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి పెద్దలు,తెల్లదేవరపల్లి వైసిపి స్థానిక పెద్దలు ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించిన వారి గెలుపు కొరకు తాను చిత్తశుద్ధితో సంపూర్ణ కృషి చేస్తానన్నారు.

# బెజవాడ బెబ్బులికి ఘన నివాళులు





**విస్సన్నపేట,జూలై 4 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో సత్తుపల్లి రోడ్డు లోని బెజవాడ బెబ్బులి జననేత వంగవీటి మోహన రంగారావు జయంతి కార్యక్రమాలను రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. భారీ కేకు కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ అందించారు.

# ఆయన పిలుపే ఒక ప్రభంజనం



**విస్సన్నపేట,జూలై 4 (వార్తాప్రభ) :** ప్రముఖ భారతీయ రాజకీయ నాయకుడు బెజవాడ బెబ్బులి గా ప్రజల హృదయాలలో కొలువైన దివంగత జననేత వంగవీటి మోహన రంగారావు పిలుపే ఒక ప్రభంజనశీ అని మండల వైసీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన జయంతి కార్యక్రమంలో వైసీపీ పెద్దలు అన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కేకు కట్ చేసి పంపిణీ చేయడం జరిగింది . ఇదే కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాలంకి సీతా రెడ్డి జన్మదిన వేడుకలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గద్దల మల్లయ్య, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ప్రకాష్,లక్ష్మయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎన్వి కుటుంబరావు, యువ నాయకులు సానం సతీష్ పలువురు వైసీపీ పెద్దలు తోపాటు బేబీ లక్కీ పాల్గొనడం కోసమెరుపుగా చెప్పుకోవచ్చు.

# మన్యం వీరుడికి జయంతి శుభాకాంక్షలు




**తిరువూరు,జూలై 4 (వార్తాప్రభ) :** తిరువూరుమన్యం వీరుడు, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు. 'స్వరాజ్యమే మా జన్మహక్కు' అంటూ ఆదివాసీల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి ఆదర్శాలు నేటి యువతకు స్ఫూర్తి. ఆయన చూపిన దేశభక్తి, ధైర్యం మనందరికీ మార్గదర్శకం." జయ కృష్ణ హాస్పిటల్ అధినేత ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారు ఎండి జనరల్ ఫిజీషియన్

# బెజవాడ బొబ్బిలి రంగ జయంతి



**తిరువూరు,జూలై 4 (వార్తాప్రభ) :** తిరువూరులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వంగవీటి మోహన్ రంగా 79 జయంతి కార్యక్రమం. విఎం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నియోజవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్..పేదల అభ్యున్నతి కోసం ప్రజాపోరాటాలు చేసిన వంగవీటి రంగాను ఆదర్శం గా తీసుకుని నేటి యువత పనిచేయాలని పేర్కొన్నారు.వంగవీటి మోహన్ రంగా అనే వ్యక్తి ఒక కులానికో, ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదని ఆయనొక శక్తిని కొనియాడారు. పేదల అండగా నిలిచేతత్వమే ఆయనకు ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానంసంపాదించిందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# సిఇఐఆర్ పోర్టల్ ద్వారా 602 మొబైల్ ఫోన్ల రికవరీ




**కాకినాడ, జూలై 4 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వ సిఇఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించే కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా పోలీసులు విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 12వ విడత మొబైల్ రికవరీ మేళాలో భాగంగా రూ.1.20 కోట్ల విలువైన 602 మొబైల్ ఫోన్లను ఎస్పీ జి.బిందు మాధవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. పోర్టల్లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా ఐటీ కోర్ బృందం ఐఎంఇఐ ట్రాకింగ్, జీపిఎస్ ట్రేసింగ్, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ నిఘా, డేటా విశ్లేషణ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన 12 విడతల్లో మొత్తం 4,603 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు, వాటి విలువ రూ.7.68 కోట్లుగా ఉందని ఎస్పీ తెలిపారు. మొబైల్ పోయిన వెంటనే www.ceir.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని, సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్లైన్కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్ పోయిన వెంటనే బ్యాంకు ఖాతాలు,యుపిఐ సేవలను భద్రపరచడం, సిమ్ కార్డును బ్లాక్ చేయించడం,గూగుల్ యాపిల్ ఐడి, బ్యాంకింగ్ యాప్లు,వాట్సాప్ , సోషల్ మీడియా ఖాతాల పాస్వర్డులు మార్చుకోవాలని సూచించారు.అలాగే సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసే ముందు బిల్లు, బాక్స్, ఐఎంఇఐ నంబర్ను తప్పనిసరిగా పరిశీలించాలని, అపరిచితుల వద్ద నుంచి మొబైల్ కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మహంతి కిషోర్ కుమార్, ఎస్. శ్రీనివాసరావు, ఎస్డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ కెవివి సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాపురుషుడు మండలి నాటక ప్రదర్శన విజయవంతం చేయండి..

● సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు ఎంవీఆర్ శాస్త్రికి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి పురస్కారం ప్రదానం చేయనున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్. ● సజ్జా రామకోటయ్య..సజ్జా రాజేష్ మెమోరియల్ నిర్వాహకులు సజ్జా చలపతిరావు



**చల్లపల్లి/అవనిగడ్డ,జూలై 4 (వార్తాప్రభ) :** మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీడీపీ సీనియర్ నాయకులు సజ్జా చలపతిరావు తెలిపారు. సజ్జా రామకోటయ్య, సజ్జా రాజేష్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు చల్లపల్లి లోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభ, మహా పురుషుడు మండలి నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ సందర్భంగా ప్రసిద్ధ పత్రికా సంపాదకులు, పాత్రికేయ దిగ్గజం ఎంవీఆర్ శాస్త్రికి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వీరితో పాటు అతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ, విద్యావేత్త బుద్దిగ జమిందారు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా విద్యా శాఖ, సాంఘీక సంక్షేమ శాఖలో అనేక విప్లవాత్మక నిర్ణయాలతో పేదలకు మేలు చేసిన మండలి వెంకట కృష్ణారావు ఆదర్శ జీవనం, దివిసీమ ఉప్పెన సమయంలో ఆర్త జన బంధువుగా, దివిసీమ పునర్నిర్మాతగా మండలి వెంకట కృష్ణారావు సేవలను కళ్ళకు కట్టేలా ఎఐ టెక్నాలజీ జోడించి అద్భుతమైన సన్నివేశాలతో ఈ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. చల్లపల్లి పరిసర గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు, మండలి అభిమానులు, కళాభిమానులు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని నిర్వాహకులు సజ్జా చలపతిరావు కోరారు.

# మన్యం వీరుడు అల్లూరి స్ఫూర్తి చిరస్మరణీయం - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూలై 4 (వార్తాప్రభ) :** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి, త్యాగనిరతి భావితరాలకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం ధైర్యం, త్యాగం, దేశభక్తి, నాయకత్వానికి ప్రతీక అని.. గిరిజనుల హక్కుల పరిరక్షణకు, స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. అత్యంత పరిమిత వనరులతోనే బ్రిటిష్ సైన్యాన్ని ధైర్యంగా ఎదుర్కొని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడం ఆయనకు అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా రంగంలో దూసుకుపోతున్న తిరువూరు డివిజన్ డివైఈవో శ్యామ్ సుందర్ కృషితో



**తిరువూరు,జూలై 4 (వార్తాప్రభ) :** "ప్రభుత్వ పాఠశాల అంటే నాణ్యమైన విద్యకు నిలయం" అని నిరూపిస్తున్నారు తిరువూరు డివైఈవో శ్యామ్ సుందర్ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు డివైఈవో శ్యామ్ సుందర్ గారు బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి తిరువూరు విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రతి పాఠశాలలో స్మార్ట్ తరగతులు, క్రీడా మైదానాలు, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. ఉపాధ్యాయులకు నెలకోసారి శిక్షణా కార్యక్రమాలు. విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణ ఉచితంగా అందిస్తున్నారు. గత 2 సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రైవేటు నుండి ప్రభుత్వ బడులకు వచ్చే వారి సంఖ్య కూడా అధికమైంది.విద్యార్థి భవిష్యత్తుకు పునాదిపేద విద్యార్థి కూడా ఉన్నతంగా ఎదగాలి" అనేదే ఆయన లక్ష్యం. ప్రతి పాఠశాలను స్వయంగా సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారు. పాఠశాలల్లో వార్షికోత్సవాలు, సైన్స్ ఫెయిర్లు, వ్యాస రచన పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో దాగున్న ప్రతిభనువెలికితీస్తున్నారు.ఆయన సమర్థవంతమైన నాయకత్వం, క్రమశిక్షణ కారణంగా తిరువూరు విద్యా రంగం జిల్లాలోనే ముందు వరుసలో నిలిచింది. గూజ ఫలితాల్లో, ప్రతిభ పరీక్షల్లో తిరువూ–రు మండల విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తున్నారు.విద్య ద్వారా సమాజాన్ని మార్చాలనే సంకల్పంతో పనిచేస్తున్న డివైఈవో శ్యామ్ సుందర్ గారి కృషిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అందరూ అభినందిస్తున్నారు. ప్రభుత్వ బడి – బంగారు భవిష్యత్తు"అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తున్నారు.

# విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటం

● అన్ని వర్గాల వారికి కాంగ్రెస్ ద్వారానే న్యాయం ● ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ



**కాకినాడ,జూలై 4 (వార్తాప్రభ) :** విద్యార్థుల జీవితాలతో కేంద్రలోని బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డిఎ ప్రభుత్వం చెలగాటమాడుతోందని తద్వారా ఎంతోమంది విద్యార్థులు మానసిక ఒత్తిడిలోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పాలక్ వర్మ అన్నారు. విద్యార్థుల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించింది అని చెప్పారు దాంట్లో విద్యార్థులకు విద్య గురించి తెలుసుకునే సమాచారాన్ని పొందుపరిచినట్లు ఆమె పేర్కొన్నారు. శనివారం కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సమావేశం జరిగింది ముందుగా దీనికి సంబంధించిన వివరాలను వర్మ పాలక్ వర్మ వివరాలను విలేకరులకు వివరించారు ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానంద రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాలను ప్రజాధనంతో సంబరాలు చేసుకుంటున్నారని విమర్శించారు ఉపయోగపడే ఏ ఒక్క పనైనా పథకాన్ని అయినా ప్రవేశపెట్టారా అని మాదేపల్లి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు ఈ సందర్భంగా పాలక్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివిన నీట్ పేపర్ లీక్ కావడంతో వారి జీవితాలలో అయోమయం పెరిగాయని తద్వారా సుమారుగా 20 మందికి పైగా విద్యార్థుల ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఇంత జరిగినా ప్రధాని మోడీ, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించలేదన్నారు. నీట్ పేపర్ కాకుండా యూపీఎస్సీ, ఆర్ఆర్బి, ఎస్ఎస్సి, టెట్ వంటి పరీక్ష పేపర్లు కూడా లీకై వాటి ద్వారా బీజేపీ పెద్దలు లాభం పొందుతుంటే విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎంతో నష్టం కలుగుతుందన్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులు సుమారు ఒక కోటి 32 లక్షల ఖర్చు చేస్తుండగా ప్రభుత్వం 142కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం అండగా నిలిచారని రాజస్థాన్ రాష్ట్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మద్దతుగా నిలిచిన సంఘటనను గుర్తు చేశారు. తమ పార్టీ ఆధ్వర్యంలో కొత్తగా ఒక యాప్ రూపొందించామని దీనిలో విద్యార్థులు హాజరయ్యే పరీక్షలు పూర్తి వివరాలు ఉంటాయని దానికి అందరూ క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని పాలక్ వర్మ సూచించారు. ఈ సమావేశంలో పార్టీ కాకినాడ సిటీ అధ్యక్షుడు చెక్క నూకరాజు నాయకులు మల్లిపూడి రాంబాబు, తాళ్లూరు రాజు, మట్టా ప్రసాద్, లలిత, ధన కొండ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండైనా వానైనా లెక్కచేయని ఎమ్మార్వో కే లక్ష్మీ కళ్యాణి



**విస్సన్నపేట,జూలై 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో ఎండ వనలను లెక్కచేయకుండా మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి ఎస్ ఐ ఆర్ నిర్వహిస్తున్న వీఆర్వో వీఆర్ఏల విధులను మండల తాసిల్దార్ లక్ష్మీ కళ్యాణి ప్రత్యక్షంగా పరివేక్షించారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరీక్షించిన నోడల్ అధికారిణి చక్రాణి



**విస్సన్నపేట,జూలై 4 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నోడల్ అధికారిణి చక్రాణి ఎస్ ఐ ఆర్ ఓట్లు సంబంధిత కార్యక్రమాన్ని ప్రజలతో మమేకమై ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, డిటి విజయభాస్కర్ ఆర్ఐ సుజాత బిఎల్ఓ లు, మరియు బిఎల్ఎలు పాల్గొన్నారు

# స్వామి వివేకానంద బోధనలు యావత్ మానవాళికి మార్గదర్శకం

● యువత వివేకానంద ఆశయాలను ఆచరణలో పెట్టాలి

● కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం,జూలై 4 (వార్తాప్రభ) :** భారత ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు, యువతకు శాశ్వత స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం స్థానిక శివాలయం వీధిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ స్వామి వివేకానంద కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాకుండా, యువశక్తిని మేల్కొలిపిన మహత్తర జాతీయవేత్త అని కొనియాడారు. ఆయన బోధించిన దేశభక్తి, సేవాభావం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, మానవతా విలువలు నేటికీ సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించవద్దు అనే స్వామి వివేకానంద సందేశం ప్రతి యువకుడికి జీవితాంతం స్ఫూర్తిగా నిలుస్తుందని మంత్రి అన్నారు. యువత తమలోని అపారమైన శక్తిని గుర్తించి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సనాతన విలువలను ప్రపంచ వేదికపై గర్వంగా చాటిన మహనీయుడిగా స్వామి వివేకానంద చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి తెలిపారు. ఆయన ఆశయాలను అనుసరిస్తూ సేవా భావంతో, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, ఎస్ కే పీ పీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గణేష్ శర్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కట్ట నాగేశ్వరరావు, దంగేటి గౌరీ శంకర్, అల్లం శ్రీను, దిగుమర్తి వీరబాబు, ఏసుదాసు, వాసంశెట్టి చంద్రశేఖర్, బొండా వెంకన్న, బొండా వెంకట నరసింహ నాయుడు, రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.

# నేడు సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు ఎంవీఆర్ శాస్త్రికి "మండలి" పురస్కారం.




**చల్లపల్లి/అవనిగడ్డ,జూలై 4 (వార్తాప్రభ) :** సీనియర్ సంపాదకులు, చరిత్ర పరిశోధకులు ఎంవీఆర్ శాస్త్రికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం చల్లపల్లిలో " మండలి వెంకట కృష్ణారావు శతజయంతి పురస్కారం "ప్రదానం చేయనున్నారు. సజ్జా రామకోటయ్య ,సజ్జా రాజేష్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి, మహా పురుషుడు మండలి నాటక ప్రదర్శన వేదికపై ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఆంధ్రభూమి పూర్వ సంపాదకులుగా, నిజాన్ని నిర్భయంగా వ్రాసి పత్రికారంగ విలువలు నిలిపిన పాత్రికేయ దిగ్గజంగా ఎంవీఆర్ శాస్త్రి ఖ్యాతి గడించారు. వ్యవస్థలను కదిలించే ప్రశ్నలతో, చరిత్రను నిలదీసే కలంతో అరుదైన అక్షర శక్తిగా ఎంవీఆర్ శాస్త్రి గుర్తింపు పొందారు. ఆయన వ్యాసాలు ప్రజల్లో ఆలోచనకు, ప్రతిస్పందనకు, మార్పునకు ప్రేరణ ఇచ్చేవిగా నిలుస్తాయి. ప్రజల పక్షాన నిలిచి, నిజం కోసం ఆయన నిరంతరం అక్షర పోరాటం చేస్తున్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి...



**గుడ్లవల్లేరు,జూలై 4 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్ ఆదేశాల మేరకు శనివారం అల్లూరి చిత్ర పటానికి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ పి.స్వరూప్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ పోలుకొండ బలరామ్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.




తిరువూరు మండలం లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ రోజున సహకార వారోత్సవాల సందర్భంగా ఎల్ నీ నో వల్ల తగ్గుతున్న వర్షపాతాలు గురించి రైతులకు తెలియజేస్తూ ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచనిస్తూ లు ఇచ్చినారు ఈ కార్యక్రమంలో రైతులు సహకార సంఘ సీఈవో బొల్లినేని రఘురాం వి ఏ ఏ మురళి సహకార సమస్య సిబ్బంది హాజరైనారు

**–తిరువూరు,జూలై 4 (వార్తాప్రభ) :**

# జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో.. వివాహిత ఆత్మహత్య.

**పిఎస్ లో ఫిర్యాదు చేసిన మృతురాలి తల్లి జయమ్మ.**



**జవహర్ నగర్, జులై 4: (వార్తా ప్రభ)**కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ బాలాజీ నగర్ శాంతినగర్ కు చెందిన మజ్జురి రేఖ (21) భర్త సాయికిరణ్(ఎక్సైజ్ కానిస్టేబుల్) బాలాజీ నగర్ పరిధిలోని శాంతినగర్లో నివాసముంటున్నారు. వీరికి ఒక సంవత్సరం వయసు గల కుమారుడు ఉన్నారు. ఈనెల మూడవ తేదీన మధ్యాహ్నం సుమారు నాలుగు గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరు లేని సమయంలో రేఖ ఇంటి బెడ్ రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనంతరం ఆమె అత్త ఇంటికి వచ్చి చూడగా రేఖ ఉరి వేసుకున్న స్థితిలో కనిపించింది .వెంటనే ఆమె స్థానికులకు సమాచారం అందించగా రేఖను అక్కడ నుంచి కిందికి దింపి చూడగా చనిపోయిన స్థితిలో ఉన్నది. ఈ మేరకు సమాచారం అందుకున్న క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించి మృతు రాలి తల్లికి సమాచారం అందించగా రేఖ తల్లి జమున ఇంటికి వచ్చి చూడగా తన కూతురు చనిపోయి ఉన్నదని తన కూతురు మరణానికి అల్లుడు సాయికిరణ్, అత్త మామ లే కారణమని ఈ మేరకు జయమ్మ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భక్తులను ఆకట్టుకున్న పద్మశ్రీ డా. శోభరాజు నిర్వహిస్తున్న "అన్నమా స్వరార్చన"





**శేరిలింగంపల్లి,జూలై 4 (వార్తాప్రభ):**అన్నమయ్యపురంలో పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదానం--అన్నమ స్వరార్చన కార్యక్రమంలో భాగంగా ఈ శనివారం 150 మందికి పైగా భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేశారు. అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం,లక్ష్మీ అష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరం,అన్నమ గాయత్రితో కార్యక్రమం ప్రారంభమైంది. నాగోల్‌కు చెందిన ఎస్ఎస్వీ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ గురువు శ్రీవాణి అంబడపూడి శిష్యులు అన్నమయ్య సంకీర్తనలకు భక్తి నృత్యాలు ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డా. శోభారాజు అన్నమాచార్య సంకీర్తనకు భావార్థ వివరణ ఇచ్చి, శిష్యులను తీర్చిదిద్దిన గురువు శ్రీవాణి అంబడపూడిని అభినందించారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమం మంగళహారతి, ప్రసాద వితరణతో భక్తి పారవశ్య మధ్య ముగిసింది.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్, జూలై 4, (వార్తాప్రభ) :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు సూరారం సాయిబాబా నగర్ పరిధిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 293 సాయిబాబా నగర్ విభాగం (డివిజన్) పరిధిలోని అపురూప కాలనీ, పుష్పగిరి బస్తీ మరియు తెలుగు తల్లి నగర్ (60 గజాలు) ప్రాంతాలలో స్థానిక యువజన సంఘాలు, కాలనీ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ జిల్లా మత్స్యకార సహకార సంఘం (ఫిషరీస్) చైర్మన్ మన్నె రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా బస్తీలలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు చిత్రపటాలు మరియు విగ్రహాలకు ఆయన పూలమాలలు సమర్పించి, చేతులెత్తి మొక్కి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తన అసాధారణ ధైర్యసాహసాలతో చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం, వారిపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా బ్రిటిష్ హింసాత్మక పాలనకు ఎదురొడ్డి రంపా ప్రాంతంలో మన్యం విప్లవ పోరాటానికి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఆనాటి పోరాటాల ద్వారా దేశ ప్రజలలో ఆయన బలమైన స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చారని పేర్కొన్నారు. అల్లూరి చూపిన దేశభక్తి, అంకితభావం, నిస్వార్థ సేవ మరియు దేశం కోసం చేసిన ప్రాణత్యాగం నేటి తరం యువతకు ఎంతో ఆదర్శప్రాయమని చెప్పారు. ప్రతి ఒక్కరూ అల్లూరి సీతారామరాజు ఆశయాలను, ఆచరణలను తమ జీవితాల్లో అవలంబిస్తూ, సమాజాభివృద్ధికి మరియు దేశ ప్రగతికి పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ జయంతి ఉత్సవాలలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు భాస్కర్ రెడ్డి, గురువారెడ్డి, సత్తిరెడ్డి, గణేష్, సాయి రెడ్డిలతో పాటు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున హాజరైన మహిళా సోదరీమణులు, యువకులు మరియు స్థానిక బస్తీల ప్రజలు పాల్గొని మన్యం వీరుడికి జోహార్లు అర్పించారు.

# సింగరేణి పరిరక్షణకై సంధ్యారాణి సమర శంఖం!!

● సింగరేణి కుంభకోణంపై విచారణకు డిమాండ్ ● 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి ● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పణ



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 4 (వార్తాప్రభ):**హైదరాబాద్ వేదికగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పరిరక్షణ కోసం రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కందుల సంధ్యారాణి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని శనివారం కలిసి ఒక సమగ్ర డిమాండ్ పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వెన్నెముకగా, 'మినీ రత్నా'గా పేరుగాంచిన సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వ అవసరావకాశాలు, అధికారుల బాధ్యతారాహిత్యం తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని ఆమె ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వేల కోట్ల రూపాయల విలువైన బాండ్లు కలిగి ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ, నేడు రాష్ట్ర ప్రభుత్వ విభాగాలైన జెన్‌కో, ట్రాన్స్‌కోల నుండి రావాల్సిన రూ. 56 వేల కోట్ల భారీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల కనీసం కార్మికులకు సకాలంలో వేతనాలు కూడా ఇవ్వలేని దయనీయ స్థితికి చేరుకుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ యాజమాన్యం తన అంచనాలకు మించి, వాస్తవంగా ఉత్పత్తి కానటువంటి లక్షలాది టన్నుల బొగ్గును రికార్డుల్లో చూపించి, సెస్ రూపంలో కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారాన్ని మోస్తూ పెద్ద ఎత్తున బొగ్గు కుంభకోణానికి పాల్పడుతోందని ఆరోపించారు. దీనితో పాటు నైని బ్లాక్ బొగ్గు రవాణాకు సంబంధించిన కొత్త నిబంధనల ఉల్లంఘనలపై, మెడికల్ అన్‌ఫిట్‌నెస్ బోర్డు నిర్ణయాలలో జరుగుతున్న అవినీతి, పక్షపాత వైఖరిపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మరోవైపు సంస్థలో దశాబ్దాలుగా రక్తాన్ని చెమటగా మార్చి శ్రమిస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ సిఫార్సుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించడం లేదని, వారి కుటుంబాలకు కనీస సామాజిక భద్రత కరువైందని పేర్కొన్నారు. మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి ఇందులో 49 శాతం వాటా ఉన్నందున, ప్రత్యేక చొరవ తీసుకొని ఒక స్వతంత్ర దర్యాప్తు కమిటీని నియమించి ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ సింగరేణి సంస్థను సర్వనాశనం కాకుండా కాపాడాలని కందుల సంధ్యారాణి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ముక్తకంఠంతో కోరారు.

# యువత స్వయం ఉపాధి దిశ గా ముందుకు రావటం అభినందనీయం.

## బాంబూ బ్రూ కాఫీ షాప్ శుభారంభం లో నాయకుల అభినందన



**శేరిలింగంపల్లి,జూలై 4 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ మెయిన్ రోడ్డులో కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లి"బాంబూ బ్రూ కాఫీ షాప్"లిను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంటెస్టేడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. నాణ్యమైన సేవలు,పరిశుభ్రమైన వాతావరణం,వినియోగదారుల పట్ల ఆత్మీయతతో వ్యవహరిస్తే ఏ వ్యాపారమైనా విజయవంతమవుతుందని సూచించారు. స్థానిక ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ సంస్థ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి ద్వారా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం సమాజానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలో అవకాశాలను సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడటం ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం షాప్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారంలో మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నటుడు చిన్న, సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, జలేందర్ రెడ్డి, రంజిత్ పూరీ, దొరబాబు, కృష్ణమూర్తి, శ్రీధర్, అజయ్, శేఖర్, శ్రీశైలం, రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ!!

## రూ.15 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ షాపులకు ఇన్స్యూరెన్స్ కల్పించాలని విజ్ఞప్తి




**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 4 (వార్తాప్రభ):**గోదావరిఖని లక్ష్మీనగర్ షాపింగ్ ఏరియాలో శుక్రవారం అర్ధ రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన వాసవి కొబ్బరికాయలు, పూజా సామాగ్రి దుకాణ యజమాని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం సంఘటన స్థలంలో పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా చోటుచేసుకున్న ఈ ఘటనలో దుకాణంలోని సామగ్రి పూర్తిగా దగ్ధమై భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.15 లక్షల నష్టపరిహారం అందించాలని, ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా లక్ష్మీనగర్‌లోని అన్ని షాపులకు తప్పనిసరిగా ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు షాపులు, ఇళ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం, సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో వ్యాపారులకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో నడిపెల్లి మురళీధర్ రావు, నారాయణ దాసు మారుతి, కిరణ్, కోడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిరాములు జన్మదిన వేడుకలు




**చింతల్, జూలై 4 (వార్తాప్రభ) :** జీడిమెట్ల 132వ విభాగం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట సిద్దిరాములు జన్మదిన వేడుకలు చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అత్యంత ఘనంగా జరిగాయి. శుక్రవారం నాడు జరిగిన ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే సమక్షంలో కుంట సిద్దిరాములు కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పుట్టినరోజు జరుపుకుంటున్న కుంట సిద్దిరాములుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కుంట సిద్దిరాములును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ వేడుకల నేపథ్యంలో చింతల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. నియోజకవర్గంలోని వివిధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు కుంట సిద్దిరాములుకు బొకేలు, మిఠాయిలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తన పుట్టినరోజు వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించి, తనకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌కు మరియు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కుంట సిద్దిరాములు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# హాస్టల్ భవనంపై నుంచి దూకి మృతి చెందిన బీటెక్ విద్యార్థి



**శేరిలింగంపల్లి,జూలై 4 (వార్తాప్రభ):** గచ్చిబౌలిలోని ఐఐఐటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శనివారం తెల్లవారుజామున హాస్టల్ భవనం ఆరో అంతస్తు నుంచి దూకి మృతి చెందాడు. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన అనిరుద్ (20)గా పోలీసులు గుర్తించారు. అతడు కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం కొంతకాలంగా అనారోగ్యం, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

# శిల్పారామంలో అలరించిన వారాంతపు సాంస్కృత కార్యక్రమాలు





**శేరిలింగంపల్లి,జూలై 4 (వార్తాప్రభ):** మాదాపూర్ శిల్పారా మంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన భరతనాట్యం,కూచిపూడి,కథక్ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నిత్య మనందరం శిష్య బృందం రంగపూజ,పుష్పాంజలి, ముద్దుగారే యశోద, గణేశ కౌతం, మామవతు శ్రీ సరస్వతి తదితర అంశాలతో భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది. జాతీయ మేధోపరమైన వైకల్యం ఉన్న వ్యక్తుల సాధికారత సంస్థకు చెందిన కళాకారులు 'స్వాగతం కృష్ణ', 'నటరాజ స్తోత్రం' నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం శ్రీమతి ప్రాచి శిష్య బృందం 'తరణ', 'కృష్ణ కవిత', 'గణేష్ వందన', 'రాజ్ జోగ్' తదితర అంశాలతో కథక్ నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకుంది.

# వార్తా ప్రభ హైదరాబాద్

# రోశయ్య సేవలు చిరస్మరణీయం!!

● ప్రజాసేవలో ఆయన ఆదర్శప్రాయుడు
● తెలుగు ప్రజలకు విశిష్ట సేవలు అందించిన ప్రజానేత
● రామగుండం మేయర్ మహంకాళి స్వామి



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 4 (వార్తాప్రభ):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన ప్రజాసేవలను స్మరించుకున్నారు. రాజకీయాల్లో నిజాయితీ, నిరాడంబరత, ఆర్థిక క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన రోశయ్య రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజల సంక్షేమాన్ని ఎల్లప్పుడూ ముందుంచి పనిచేసిన గొప్ప నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని తెలిపారు. పరిపాలనలో విలువలు, పారదర్శకతకు ఆయన నిలువెత్తు నిదర్శనమని అన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, ఏఈ మీర్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా టీఎంసీ మౌనిక, పలువురు కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొని రోశయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# యువత దేశభక్తి సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి

**- మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్**



**శేరిలింగంపల్లి,జూలై 4 (వార్తాప్రభ):**మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్‌లోని అల్లూరి సీతారామరాజు నగర్ కాలనీలో ఆయన విగ్రహానికి మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్థానిక నాయకులు,కాలనీవాసులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం, దేశభక్తి,గిరిజనుల హక్కుల కోసం చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, సేవాభావం,సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు,యువజన నాయకులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బూత్ సంఖ్య 527లో ముమ్మరంగా ఓటరు సమగ్ర సవరణ పత్రాల పంపిణీ



**కుత్బుల్లాపూర్, జూలై 4, (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా బూత్ సంఖ్య 527 పరిధిలో ఓటర్లకు అవసరమైన వివిధ రకాల దరఖాస్తు పత్రాల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ శక్తి కేంద్రం ఇన్‌ఛార్జ్ వేముల రమేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులి బలరాం మాట్లాడుతూ.. ఓటర్లందరూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పత్రాలను ఎక్కడా తప్పులు లేకుండా సక్రమంగా నింపాలని సూచించారు. నింపిన దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో జత చేసి, నిర్దేశిత గడువులోగా బూత్ స్థాయి అధికారికి సమర్పించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల నమోదు, ఓటరు కార్డులో పేరు సవరణ, చిరునామా మార్పు లేదా ఇతర తప్పుల సవరణ అవసరమైన వారు ఈ సమగ్ర సవరణ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదై ఉండేలా చూసుకోవడం ప్రాథమిక ప్రజాస్వామ్య బాధ్యత అని నాయకులు స్పష్టం చేశారు. ఓటు హక్కు ద్వారానే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం లభిస్తుందని, కాబట్టి బస్తీలలోని ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ ఓటరు చైతన్య మరియు పత్రాల పంపిణీ కార్యక్రమంలో బూత్ స్థాయి ప్రతినిధి భాగ్యలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకుడు మనీష్‌తో పాటు పలువురు పార్టీ ప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు మరియు స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బాబుకు అమరావతికీ రాచ బాటేనా ?

అమరావతి రాజధాని మీద తన వ్యతిరేకతను పదే పదే జగన్ చాటుకుంటున్నారు అన్నది జనాలలో బలంగా వినిపిస్తున్న భావనగా ఉంది. ఎందుకంటే లాజిక్ కి అందని విధంగా ఆయన వాదనలు కానీ నినాదాలు కానీ ఉన్నాయని అంటున్నారు. అదే ఇపుడు టీడీపీకి చంద్రబాబుకు అలాగే అమరావతికి రాచబాటగా మారుతున్నాయని అంటున్నారు. 2014లో అమరావతికి జగన్ జై కొట్టిన సంగతి అసెంబ్లీ రికార్డుల సాక్షిగా ఉంది అని గుర్తు చేస్తున్నారు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన తరువాతనే మూడు రాజధానులు అని జగన్ కొత్త టర్న్ తీసుకున్నారు. ఆనాడు ఆయన చెప్పినది మూడు ప్రాంతాలూ వికేంద్రీకరణ అన్నది, ఇక తాజాగా మావిగన్ అంటున్నారు. మరి ఇలా జగన్ ఆలోచనలు కీలకమైన ఏపీకి సెంటిమెంట్ గా ఉన్న రాజధాని విషయంలో మారిపోవడం వైసీపీకి జగన్ కి మైనస్ అవుతోందని అంటున్నారు.అదే సమయంలో టీడీపీ నెత్తిన జగన్ పాలు పోస్తున్నారా అని అంటున్నారు. ఇదంతా జగన్ వ్యూహాల లేమితో చేస్తున్నారా లేదా వేరే ఆలోచనలతోనా అంటే వీటన్నిటి కంటే కూడా అమరావతి రాజధాని పట్ల జగన్ కి వ్యతిరేకత మొదటి నుంచి ఉంది అన్న దానిని టీడీపీ నేతలు పదే పదే చెబుతూ వస్తున్నారు. ఇపుడు జగన్ కూడా అదే నిజం అని రుజువు చేసుకుంటున్నారు అని ఎత్తి చూపిస్తున్నారు. లేకపోతే విశాఖ రాజధాని అన్నపుడు రెడీ మేడ్ సిటీ అన్నారు, మరి ఆనాడు జగన్ కి మావిగన్ ఎందుకు గుర్తు రాలేదు అని ప్రత్యర్థులు అంటున్నారు. ఇది పాయింటే కదా అని జనాలలోనూ ఆలోచన ఉంది. మరి మావిగన్ అంటున్నపుడు వికేంద్రీకరణ అంశం ఏమైపోయింది అన్నది మరో ప్రశ్న. ఉత్తరాంధ్ర రాయలసీమ వెనుకబాటుతనానికి గురి అయ్యాయని చెప్పి రాజధానులను అక్కడ పెడతామని చెప్పి ఇపుడు యూటర్న్ తీసుకుంటే ఆ ప్రాంతాల వారికి వైసీపీ ఏ విధంగా జవాబు చెబుతుందని కూడా ప్రశ్నిస్తున్నారు.టీడీపీకి పెద్దగా శ్రమ ఆయాసం లేకుండా మూడేళ్ళ ముందే రాజధాని అజెండాను జగన్ సెట్ చేసి పెట్టారు అని అంటున్నారు. నిజానికి 2029 ఎన్నికల్లో నినాదాలు అయితే ఎవరికీ లేవు. టీడీపీ కూడా 2014, 2024లలో అమరావతి నినాదాన్ని ఎమోషనల్ గా ఉపయోగించింది. అదే భావోద్వేగపూరిత మైన నినాదంగా చేసుకుని జనంలోకి వెళ్ళింది.జనాలు కూడా జై కొట్టారు. 2029 నాటికి ఆ నినాదం ఉండదని అంతా అనుకున్నారు. ఎందుకంటే అమరావతికి చట్టబద్ధత వచ్చేసింది. దాంతో పాటు ప్రజలు కూడా అమరావతి రూపూ షేపూ చూస్తారు, ఎంతో కొంత వారికి చూపించాల్సిన ఒత్తిడి అయితే కూటమి మీద ఉంది. అది ఎంత అన్నది జనాల సంతృప్తి బట్టి ఆధారపడి ఉంటుంది. అమరావతి పూర్తి స్థాయిలో పూర్తి అవడం అంటే మూడేళ్ళలో సాధ్యం కాదు, ఈ నేపధ్యంలో కొంత టీడీపీకి ఇబ్బందే అవుతుంది. కానీ జగన్ మధ్యలో వచ్చి మావిగన్ నినాదం ఎత్తుకోవడంతో అమరావతి సెంటిమెంట్ కి మళ్ళీ ఊపిరులు అద్దినట్లు అయింది అని విశ్లేషిస్తున్నారు.జగన్ అంతటితో ఆగకుండా అమరావతినా మావిగన్ నా అని ఒక పోలిక పోటీ పెట్టి 2029లో ఇదే అజెండా అన్నారు. సహజంగానే అమరావతి అన్నది ఇపుడు కళ్ళకు కనిపిస్తున్నది, చట్టబద్ధత కేంద్రం ఇచ్చింది. యాభై వేల కోట్ల రూపాయలతో భారీ ఎత్తున నిర్మాణం పనులు అవుతున్నాయి. దాంతో ఎవరూ అమరావతిని ఈ దశలో వద్దు అనుకోరు, ఇపుడు రాజధాని ఎంపిక అన్నది అయిపోయిన చరిత్ర. దాంతో మావిగన్ అన్నా మరేటి అన్నా జనాల మొగ్గు అమరావతికే ఉంటుందని అంటున్నారు. అదే సమయంలో జగన్ హయాంలో 2019 నుంచి 2024 మధ్యలో మూడు రాజధానులు అని చెప్పారు, అది విఫల ప్రయోగం అయింది. ఇపుడు మావిగన్ అన్నా అలాగే అవుతుంది అన్న సంశయాలు కూడా ఉంటాయి. దాంతో పాటు ఏపీ జనాలు రాజధాని విషయంలో ప్రయోగాలకు విసిగి ఉన్నారని అంటున్నారు. ఇలా ఎన్ని రకాలుగా చూసుకున్నా అమరావతికే జనాలు ఓటెత్తే విధంగా అనివార్యమైన పరిస్థితి ఉంది. దాంతో అమరావతి నినాదాన్ని మరో ఎన్నికల దాకా టీడీపీ కూటమి వినియోగించుకునేలా జగన్ రాచబాట వేశారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## జాతీయ పతాక రూపకర్త అయిన పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా అన్నదానం



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జాతీయ పతాక రూపకర్త అయిన పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని శ్రీ పింగళి వెంకయ్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు అంగడాల అనిత తెలిపారు, శనివారం మిల్క్ ప్రాజెక్టు భీమను వారి పేట శ్రీ పింగళి వెంకయ్య స్వచ్ఛంద సేవా సంస్థ



ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ పింగళి వెంకయ్య స్వచ్ఛంద సేవా సంస్థ తన భర్త అంగడాల సురేష్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించే వారిని అన్నారు, కాలక్రమమైన ఆయన చనిపోయిన తర్వాత ఆ సేవా సంస్థ బాధ్యతలను తాను తీసుకొని సంస్థ అధ్యక్షురాలుగా కొనసాగుతూ పింగళి వెంకయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నానని తెలిపారు, అందులో భాగంగా ఈరోజు వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని అన్నారు, ఆగస్టు రెండో తేదీ పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా తమ సంస్థ ద్వారా పింగళి వెంకయ్యకు ఘనంగా నివాళులర్పించ దలిచామని అన్నారు,

# ఘనంగా మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ కొణిజేటి రోశయ్య 93వ జయంతి కార్యక్రమం

- అధికార అహంకారంతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదు
- ప్రశ్నిస్తే కేసులు పెడతారా?.. రాష్ట్రంలో నడుస్తోంది రెడ్ బుక్ రాజ్యాంగం
- కూటమికి రోశయ్య ప్రసంగాలే కరెక్ట్ మెడిసిన్.. బాబు టీమ్‌కు ట్రైనింగ్ ఇవ్వాలి
- చంద్రబాబుకు ఆర్థిక క్రమశిక్షణ లేదు.. నాడే కౌన్సిల్‌లో చెప్పిన రోశయ్య
- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు





**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక క్రమశిక్షణకు నిలువెత్తు నిదర్శనమైన స్వర్గీయ కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలు విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని త్రిమూర్తి చౌక్ వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రోశయ్య విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణి చేసారు. రోశయ్య జయంతి, వర్ధంతుల సందర్భంగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఆనవాయితీగా వస్తోందని వెలంపల్లి శ్రీనివాసరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆర్యవైశ్యులకు, తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ రోశయ్య ఒక గొప్ప నిదర్శనమని కొనియాడారు. పొట్టి శ్రీరాములు గారిని, మహాత్మా గాంధీ ని తాము చూడకపోయినా, తమ మధ్యే ఉంటూ ఈ రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించిన రోశయ్య ని చూసే భాగ్యం కలిగిందన్నారు. పదవుల వెనుక ఆయన ఎన్నడూ పడలేదని, పదవులే ఆయన వెతుక్కుంటూ వచ్చాయని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు కేవలం రోశయ్య కి మాత్రమే దక్కిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, వివిధ శాఖల మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా ఇన్ని ఉన్నత పదవులు నిర్వహించినప్పటికీ, తన రాజకీయ జీవితంలో ఎక్కడా చిన్న మచ్చ కూడా లేకుండా నీతి, నిజాయితీలతో రాజకీయం చేసిన మహోన్నత వ్యక్తి రోశయ్య ని కొనియాడారు.ఐదు దశాబ్దాల పాటు సాగిన రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లను, అటు అధికారాన్ని, ఇటు ప్రతిపక్షాన్ని చూసిన రోశయ్య ని చూసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంతో నేర్చుకోవాలని వెలంపల్లి శ్రీనివాసరావు హితవు పలికారు. సభలో రోశయ్య అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల ప్రశ్నలకు ఎంతో చలోక్తులతో, సమర్థవంతంగా సమాధానాలు చెప్పేవారని, అదే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పక్షాన్ని అంతే ధీటుగా నిలదీసేవారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు దగ్గర నుంచి దిగువ స్థాయి నాయకుల వరకు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోమ్ మంత్రి వంగలపూడి అనిత గాని రోశయ్య ని చూసి వారి భాషను, మాట్లాడే విధానాన్ని నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి నాయకులు మాట్లాడుతున్న తీరు, ప్రవర్తిస్తున్న విధానం వల్ల రాష్ట్ర ప్రజల ముందు వారు ఏ విధంగా అభాసుపాలవుతున్నారో అందరూ గమనిస్తున్నారని అన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన అంతా ఒక డొల్ల పరిపాలన అని వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. నేడు రాష్ట్రంలో ప్రశ్నించడానికే అవకాశం లేకుండా పోయిందని, ప్రశ్నించే గొంతులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని అడిగినా, ప్రభుత్వ తప్పులను ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా కేసులు పెట్టే విధంగా నాయకులు వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కూటమి నాయకులందరికీ రోశయ్య అసెంబ్లీ ప్రసంగాలను, ఆయన మాట్లాడిన మాటల వీడియోలను చూపించి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. అప్పుడైనా వారి నోర్లు బాగుపడతాయని, అధికారంలో ఉన్నామనే అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సమంజసం కాదని మండిపడ్డారు.రోశయ్య ఆర్థిక శాఖ మంత్రిగా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రంలో ఏ ఒక్క రోజు కూడా ఓవర్ డ్రాఫ్ట్ లేకుండా అద్భుతంగా పరిపాలన సాగించారని, కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రతిరోజూ ఓవర్ డ్రాఫ్టే నడుస్తోందని ఎద్దేవా చేశారు. గతంలో కౌన్సిల్‌లోనే రోశయ్య చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడుతూ... ఆయనకు ఆర్థిక విషయాలపై ఎలాంటి అవగాహన, క్రమశిక్షణ ఉండదని స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో సాగుతున్న దౌర్జన్యాలు, రౌడీయిజాలు, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రజలు మరొక్కసారి గమనించాలని కోరారు. రోశయ్య చూపిన ఆర్థిక క్రమశిక్షణ, ఆయన ఆశయ సాధనల బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రోశయ్య ఆశయాలను, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తామంతా ఎల్లప్పుడూ కృషి చేస్తామని వెలంపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మరియు విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పశ్చిమలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక వించిపేటలోని ఇస్మాయిల్ వీధిలో శనివారం నాడు వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజు 129వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కేవలం 27 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వేచ్ఛ కోసం,



పరాయి పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం అద్వితీయం, చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాయుధ పోరాటం ద్వారానే బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలా డించవచ్చని నిరూపించిన మహోన్నత దేశభక్తుడు అల్లూరి అని శ్లాఘించారు.గిరిజనుల హక్కులను కాలరాస్తున్న అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ చట్టాలపై అల్లూరి గర్జించారని వెలంపల్లి గుర్తుచేశారు. మన్యం ప్రజలను ఏకం చేసి, వారిలో స్వదేశీ చైతన్యాన్ని రగిల్చి, చారిత్రాత్మక 'రంప విప్లవానికి' ఆయన నాయకత్వం వహించారన్నారు. సాంప్రదాయ విల్లంబులు, కొద్దిపాటి ఆయుధాలతోనే వ్యూహాత్మక గెరిల్లా పోరాటాన్ని నడిపి, బ్రిటీష్ పోలీస్ స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఆయన యుద్ధ తంత్రం చరిత్రలో నిలిచిపోతుందని స్పష్టం చేశారు.స్వార్థం లేని త్యాగానికి, అచంచలమైన ధైర్యానికి అల్లూరి సీతారామరాజు నిలువెత్తు రూపమని వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. మాతృభూమి విముక్తి కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఆయన అమరత్వం ప్రతి భారతీయుడి గుండెల్లో అగ్రేసరమై వెలుగుతోందని, నేటి తరం యువతకు ఆయన దేశభక్తి, పోరాట పటిమ ఎప్పటికీ ఆదర్శమని అన్నారు. అల్లూరి ఆశయాలను స్మరిస్తూ, ఆయనకు ఘన నివాళు లర్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, మాజీ కార్పొరేటర్లు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రోశయ్య సేవలు చిరస్మరణీయం..

**విజయవాడ పశ్చిమ ఎం ఎల్ ఏ సుజన చౌదరి**



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ కేంద్ర మంత్రి వర్యులు విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ చౌదరి ( సుజనా చౌదరి) కొనియాడారు.. శనివారం ఆయన జయంతి సందర్భంగా వాసవి ఫౌండేషన్ , విజయవాడ ఆధ్వర్యంలో భవానిపురం లో కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి విజయవాడ పశ్చిమ ఎం ఎల్ ఏ సుజన చౌదరి, అవనిగడ్డ ఎం ఎల్ ఏ మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజన చౌదరి మాట్లాడుతూ రోశయ్య ఎంతో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ అనేక జాగ్రత్తలు తీసుకునే వారన్నారు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకు దక్కిందన్నారు.. ఆయన మరి కొంతకాలం ముఖ్యమంత్రిగా పనిచేసి ఉంటే బాగుండేదని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి రాజకీయ నాయకులు ఆయన ప్రసంగాలను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఈ సందర్భంగా ఆయనతో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్యే సుజనా గుర్తు చేసుకున్నారు..

**రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలి**



ఎం ఎల్ ఏ మండలి బుద్ధ ప్రసాద్. అవనిగడ్డ ఎం ఎల్ ఏ మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఎంతో పరిణితి చెందిన వ్యక్తి అన్నారు.. పార్టీల మధ్య సిద్ధాంతపరంగా బేధాభిప్రాయాలు ఉన్న వ్యక్తిగత దూషణలకు తావు లేకుండా హుందాగా వ్యవహరించే వారిని తెలిపారు ఆయన హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే కాకుండా 15 సంవత్సరాలు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోకుండా పరిపాలన నడిపించారన్నారు.. యూపీఏ ప్రభుత్వం తమిళనాడు గవర్నర్ గా నియమించిందని చాకచక్యంగా, బాధ్యతతో పదవిని నిర్వర్తించారన్నారు ఈతరం రాజకీయ నాయకులందరూ రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్,ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఎస్ బేగ్, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు పెనుగొండ సుబ్బారాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కోగంటి రామారావు,వాసవి ఫౌండేషన్ చైర్మన్ వీ వీ కే నరసింహారావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ , మాజీ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర, గడ్డం రవికుమార్, కొణిజేటి రమేష్, కొప్పురావూరి రజిని తదితరులు పాల్గొన్నారు..

# వంగవీటి మోహన్ రంగా జంక్షన్ సొరంగం డౌన్ వద్ద ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు

**ఘన నివాళులర్పించిన వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే సుజనా చౌదరి**



**విజయవాడ పశ్చిమ జూలై 4 : (వార్తా ప్రభ ప్రతినిధి)**మాజీ శాసనసభ్యులుస్వర్గీయ వంగవీటి మోహనరంగా పేదల హృదయాలలో శాశ్వత స్థానాన్ని పొందారని ఆయన తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. శనివారం విద్యాధరపురం వి.ఎం. రంగా జంక్షన్ సొరంగం డౌన్ వద్ద స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో రంగా 79వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కాపు నాయకులు మైలవరపు దుర్గారావు, మైలవరపు కృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాధాకృష్ణ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి భారీ కేక్ కోసి స్వర్గీయ మోహనరంగా జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాల్లో భాగంగా పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన నాయకుడు రంగా అని కొనియాడారు. ఆ మహనీయుడికి కుమారుడిగా పుట్టడం తన అదృష్టమని భావోద్వేగానికి లోనయ్యారు. రంగా ఆశయాల సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని పేర్కొన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన రంగా జయంతి వేడుకలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మైలవరపు దుర్గారావు మాట్లాడుతూ వి ఎం రంగా చౌక్ లో వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా ఆయన జయంతి సందర్భంగా ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ హాజరయ్యి పేదలకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశామని తెలియజేశారు.ఈ వేడుకల్లో ఏపీ పొల్యూషన్ బోర్డ్ మెంబర్ పంచకర్ల సందీప్, నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, జనసేన రాష్ట్ర నాయకులు అమ్మిశెట్టి వాసు తదితరులు రంగా విగ్రహానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత గునుకుల పుల్లయ్య, మిరియాల వెంకటేశ్వరరావు, సుంకర కృష్ణ, మాజీ కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మహదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), గుడివాడ నరేంద్ర రాఘవ, జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన రాష్ట్ర నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, జనసేన నాయకులు లింగం శివప్రసాద్, కె.యస్.ఎన్, మూర్తి,బాడిత శంకర్,అక్కల గాంధీ, సంభన బాబురావుతో పాటు పెద్ద సంఖ్యలో రంగా అభిమానులు పాల్గొన్నారు.

# రూ 34 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సుజన చౌదరి.



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**48 మంది లబ్ధిదారులకు రూ 34 లక్షల 7 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సుజన చౌదరి కూటమి నేతలతో కలిసి పంపిణీ చేశారు.. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు.. శనివారం భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఎస్ బేగ్, జనసేన సీనియర్ నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, మాజీ కూటమి కార్పొరేటర్లు, కూటమినేతలతో కలిసి మొత్తం రూ 34, 07,396 విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను పంపిణీ చేశారు.. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వ పాలనలో పశ్చిమ నియోజవర్గంలో మొత్తం – మంది లబ్ధిదారులకు రూ – కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అమలు చేసి పేద కుటుంబాలను ఆదుకున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు.. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వ పాలనలో పశ్చిమ నియోజవర్గంలో మొత్తం 866 మంది లబ్ధిదారులకు రూ. 10.61 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అమలు చేసి పేద కుటుంబాలను ఆదుకున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు..

# శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దేవాలయ సంప్రోక్షణ మరియు శాంతి కళ్యాణము సందర్భంగా విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం మరియు సంప్రోక్షణ కార్యక్రమము దేవాలయం సంప్రోక్షణ సందర్భంగా శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి శాంతి కళ్యాణము మరియు దేవాలయ సంప్రోక్షణ నిర్వహించామని శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సహాయ అర్చకులు చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మ తెలిపారు, శనివారం మిల్క్ ప్రాజెక్ట్ భీమన వారి పేటలో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో అభిషేక ము కేవలం జీవద్వజ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు కార్యక్రమాల వివరాలు తెలియపరిచారు గణపతి పూజ పుణ్యాహవాచన సర్వతోభద్ర మండపారాధన మూలవిరాటుల అవహనతో కలసిస్తాపన మరియు వాస్తు పెరిగిన హోమాలు అయ్యో సంప్రోక్షణ సందర్భంగా స్వామివారికి ప్రాత:కాలంలో ఉదయం ఏడు గంటల నుండి స్వామి వార్లకు పంచామృత అభిషేకం, కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు, ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారి పర్యవేక్షణలో నిర్వహించారు.

# పశ్చిమలో ఘనంగా వంగవీటి మోహన రంగ 79వ జయంతి కార్యక్రమం

**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా**
**రంగా పేరు చెప్పడానికే కూటమి నేతలకు వణుకు**
**అసలు రంగా కి పవన్ ఎప్పుడైనా నివాళులర్పించారా?**
**రంగా ఆశయ సాధనలో వైఎస్సార్సీపీ ఎప్పుడూ ముందుంటుంది**
**మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దివంగత వంగవీటి మోహన రంగ 79వ జయంతి సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని చెరువు సెంటర్ వంగవీటి మోహన రంగ విగ్రహం వద్ద పశ్చిమ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ, కాపు టీమ్ మరియు రంగా అభిమానుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైఎస్సార్సీపీ ఇన్ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణి చేసారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల ద్వంద్వ నీతిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సమాజంలోని బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి, వారి హక్కుల కోసం పోరాడిన నిజమైన ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన రంగ అని వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. రంగా ప్రజా ఉద్యమాల్లో నిరంతరం శ్రమిస్తూ, చివరికి ప్రజా సంక్షేమం కోసమే తన ప్రాణాలను సైతం అర్పించారని గుర్తుచేశారు. ఇంతటి మహోన్నతమైన త్యాగం చేసిన వ్యక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకే ప్రతి సంవత్సరం రాజకీయాలకతీతంగా రంగా అభిమానులు, వైఎస్సార్సీపీ శ్రేణులు కలిసి ఇక్కడ ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయసులోనే అప్పటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రోడ్డుపై కూర్చుని దీక్ష చేస్తున్న వంగవీటి రంగా ని, నాటి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అత్యంత నిర్మొహమాటంగా, క్రూరంగా హతమార్చడం జరిగిందని వెలంపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ చారిత్రక ఘోరాన్ని ఈరోజుకూ ప్రజలెవరూ మర్చిపోలేరని ఆయన స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుండే వి.ఎం. రంగా ఆలోచనా విధానాన్ని, ఆశయాలను మనమందరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి కి వంగవీటి రంగా తో ఎంతో అనుబంధం ఉండేదని, అదేవిధంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి కూడా రంగా గారంటే అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయని వెల్లంపల్లి పేర్కొన్నారు. రంగా ఆశయాల సాధన కోసం గతంలో రాజశేఖర రెడ్డి , ఆ తర్వాత జగన్ మోహన్ రెడ్డి ఇద్దరూ కూడా ఎంతో కృషి చేశారని, వారి ఆశయాలను నిరంతరం కొనసాగించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. కూటమి నాయకులు కనీసం వంగవీటి రంగా పేరు చెప్పడానికి కూడా భయపడుతున్నారని, వారిని స్మరించుకునే పరిస్థితి అస్సలు లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గానీ ఏ రోజైనా రంగా కి మనస్ఫూర్తిగా నివాళులర్పించారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ రంగా విషయంలో ఎప్పుడూ ఒకే మాటపై ఉండరని, ఒకసారి రంగాకి కాఫీ ఇచ్చానని చెప్తూ, మరోసారి అసలు రంగా ని చూడలేదంటారని ఎద్దేవా చేశారు. ఒకసారి రంగా తో ఎక్కువ పరిచయం ఉందంటూనే, ఇంకోసారి పరిచయం లేదని అంటున్న పవన్ కళ్యాణ్.. కేవలం కాంట్రవర్సీ డైలాగుల కోసమే రంగా ని, వారి కుటుంబ సభ్యులను వాడుకుంటున్నారని, వారి సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల్లోని అన్ని కులాల వారు, అన్ని మతాల వారు రంగా ని గుండెల్లో పెట్టుకుని అభిమానిస్తారని, రంగా జయంతి, వర్ధంతి వేడుకలు రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతాయని వెలంపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈరోజు పశ్చిమ నియోజకవర్గంలో ఈ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైఎస్సార్సీపీ శ్రేణులను ఆయన అభినందించారు. అనుక్షణం రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు శ్రమిస్తున్న అభిమానులందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని, రంగా గారి ఆశయ సాధన కోసం తమ పార్టీ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు రంగ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పోరంకిలో మెడ్ ప్లస్ మెడికల్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**పెనమలూరు జులై 4 (వార్త ప్రభ ప్రతినిధి)**పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్ ప్లస్ మెడికల్ షాప్‌ను శనివారం నాడు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటు ధరల్లో లభించేలా మెడ్ ప్లస్ సేవలు అందించటం అభినందనీయమని అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా బ్రాండెడ్ మందులు 2499 కొనుగోలు పైన 25% డిస్కౌంట్, మెడ్ ప్లస్ మందులు పైన 50-80 % వరుకు డిస్కౌంట్ ఉంటుంది అని మెడ్ ప్లస్ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు వెంకటేష్, నాగేంద్ర, చంద్రు, ప్రసన్న ఆంజనేయులు నాయకులు, సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో 110 మద్యం సీసాలు స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



**మచిలీపట్నం జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నుండి గిలకలదిండి వెళ్లే రహదారిపై శనివారం ఉదయం నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్ ఫోర్స్ (ఈ ఎస్ టి ఎఫ్) పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు 10 గంటల సమయంలో ఈ ఎస్ టి ఎఫ్ మచిలీపట్నం సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, రామాని అశోక్ కుమార్ అనే వ్యక్తి అక్రమంగా 110 మద్యం సీసాలను తరలిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 110 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం తరలింపునకు ఉపయోగించిన AP16 DE 5981 నంబర్ గల హీరో గ్లామర్ మోటార్‌సైకిల్‌ను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సీఐ లక్ష్మణరావుతో పాటు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అనిల్, వేణు పాల్గొన్నారు.

## హాస్టళ్లను తనిఖీ చేసిన సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి



**ఆత్మకూరు జులై 04 (వార్తాప్రభ)** నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలను సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కె.శోభారాణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న వసతి భోజనం పారిశుద్ధ్యం తాగునీటి సౌకర్యాలు రికార్డులు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి హాస్టల్‌లో 100 శాతం అడ్మిషన్లు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో గత ఏడాదితో పోలిస్తే ఈసారి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించి రాబోయే విద్యా సంవత్సరంలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించేలా అధికారులు వార్డెన్లు కృషి చేయాలని సూచించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ సజావు అమలుపై సీఈవో ఆరా!

**- క్షేత్రస్థాయిలో పర్యటించిన వివేక్ యాదవ్**
**- అత్యంత పారదర్శకంగా ప్రక్రియ పూర్తికి దిశానిర్దేశం**



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ను అత్యంత పారదర్శకంగా, ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడంలో సమష్టి భాగస్వామ్యం అవసరమని ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం సీఈవో వివేక్ యాదవ్ విజయవాడ అర్బన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. చిట్టినగర్, కంసాలి పేట ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ 208, 217 పరిధిలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్టోరల్ ఆఫీసర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి క్షేత్రస్థాయిలో సర్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించారు. గత ఎస్ఐఆర్ ఆధారంగా ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వాటి స్వీకరణ, డిజిటైజేషన్ పనులను పరిశీలించారు. నియోజకవర్గం స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి.. అక్కడి అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి ప్రక్రియ అమలుపై ఆరా తీశారు. ఓటర్ల సేవలో స్ఫూర్తితో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించి.. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు కీలకమైన ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో కీలక భాగస్వాములు కావాలని సీఈవో వివేక్ యాదవ్ కోరారు. పర్యటనలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో) ఎ.రవీంద్రరావు, సహాయ ఈఆర్‌వోలు ఎన్.శ్రీనివాస్‌రావు, డి.హరీష్, జి.సృజన, చంద్రబోస్, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

## అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన ధైర్యం, త్యాగం, దేశభక్తి అందరికీ మార్గదర్శకం



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద, శనివారం ఉదయం అల్లూరి సీతారామ రాజు జయంతిని పురస్కరించుకొని కమిషనర్ ధ్యానచంద్ర, సిబ్బంది తో ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య పోరాటంలో తన ప్రాణాలను అర్పించి, దేశానికి అపూర్వమైన స్ఫూర్తినిచ్చిన మహానుభావుడని, దేశభక్తి, ధైర్యసాహసాల పరాకాష్ఠగా నిలిచిన ఆయన జీవితం ప్రతి భారతీయుడికి మార్గదర్శకమని పేర్కొన్నారు. నేటి యువత అతని స్ఫూర్తిని అనుసరించి దేశసేవలోకి ముందుకు రావాలని, ప్రజల సేవ చేయడం ద్వారా నిజమైన దేశభక్తిని చాటాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు మన దేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరయోధుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని, అతని ధైర్యం, త్యాగం, దేశభక్తి మనకు ఎప్పటికీ పాఠాలుగా ఉంటాయని, అటువంటి మహానుభావుడికి నివాళులు అర్పించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎ. రవీంద్ర రావు, చీఫ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, అకౌంట్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి, మేనేజర్ ప్రభావతి, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుజన చౌదరి



**విజయవాడ పశ్చిమ జులై 4 :,(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ 7 కోట్లతో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజీలు, మరియు రూ 1 కోటి 20 లక్షలతో ప్రారంభించిన బాక్స్ కల్వర్టుల నూతన నిర్మాణాలను ఎమ్మెల్యే సుజన చౌదరి కూటమి నేతలతో కలిసి పరిశీలించారు.. ఐరన్ యార్డ్, బైపాస్ రోడ్డు, చర్చ్ సెంటర్ లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని వీ ఎం సీ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు...ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఇన్సెంటివ్ ఫండ్స్ రూ 7 కోట్లతో ఐరన్ యార్డ్ , బైపాస్ రోడ్డు, పార్థసారధి రోడ్డు, పంజా సెంటర్ లో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీల నిర్మాణ పనులు , వీఎంసి జనరల్ ఫండ్స్ రూ 1 కోటి 20 లక్షలతో బాక్స్ కల్వర్టులను ప్రారంభించామని తెలిపారు..నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలను పాటించి నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఈ ఈ శ్రీనివాస్ కు తెలిపారు..పశ్చిమ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు..

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి...

**ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు.**

**మచిలీపట్నం జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతదేశ స్వాతంత్రం కోసం వీరోచితంగా పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు జయంతి నీ పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ సీతారామరాజు భారత స్వాతంత్ర చరిత్ర లో ఒక మహోజ్వల శక్తి , బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలర్పించాడని, అతడి దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందని, దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన త్యాగశీలిని, పోరాటపటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులకు సిబ్బందికి మిఠాయిలు పంచారు.



## పశ్చిమ, విజయవాడ ట్రాఫిక్ కష్టాలకు త్వరలో చెక్

**● రైల్వే అధికారులతో కలిసి ప్రతిపాదిత వంతెన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే సుజన చౌదరి ● దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వన్‌టౌన్--టూటౌన్ కనెక్టివిటీకి కీలక ముందడుగు ● పూర్తిగా రైల్వే నిధులతో ఆర్ ఓ బి నిర్మాణానికి ఆమోదం ● రానున్న రెండేళ్లలో పూర్తిచేసేలా చర్యలు ● ఎం ఎల్ ఏ సుజన చౌదరి**



**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఎర్రకట్ట రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ఎర్రకట్ట--రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం కాగా, శనివారం పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజన చౌదరి) రైల్వే అధికారులతో కలిసి ప్రతిపాదిత నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్, ఎర్రకట్ట ప్రాంతాల్లో ప్రతిపాదిత రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి)రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ సిద్ధమైన నేపథ్యంలో రైల్వే అధికారులు ప్రాజెక్టు వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వన్‌టౌన్--టూటౌన్ మధ్య కనెక్టివిటీ సమస్య పరిష్కారానికి ఇది కీలకమన్నారు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా నిరంతరం కృషి చేశామని తెలిపారు. రైల్వే శాఖ నుంచి ఆమోదం పొందేందుకు సుమారు ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వరకు నిరంతరంగా ఫాలోఅప్ చేసినట్లు చెప్పారు. ఎంపీ కేశినేని శివనాధ్ ( చిన్ని) తో పాటు తాను కూడా పలుమార్లు రైల్వే అధికారులను కలిసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా రైల్వే శాఖ నిధులతోనే వంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన డీపీఆర్ తయారీకి కూడా రైల్వే అధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. అన్ని అనుకూలంగా సాగితే వచ్చే రెండేళ్లలో వంతెన నిర్మాణం పూర్తయ్యే అవకాశముందని ఎమ్మెల్యే సుజన చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. వంతెన అందుబాటులోకి వస్తే వన్‌టౌన్--టూటౌన్ మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. వ్యాపార కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని, ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని వివరించారు. ఎర్రకట్ట ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్, పైప్‌లైన్ పనులు, వాహనాల రద్దీ కారణంగా ఈ వంతెన నిర్మాణం అత్యవసరమైందని, రెండు దశాబ్దాల క్రితమే నిర్మించాల్సిన ప్రాజెక్టు ఇప్పుడు కార్యరూపం దాల్చడం కూడా పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనాచౌదరి) స్పష్టం చేశారు..రైల్వే అధికారులు ఎస్ ఎస్ సి వర్క్స్, గతి శక్తి సూరపనేని శ్రీనివాస్, ఎ డి ఎన్ లైన్ బెజవాడ టీ వెంకయ్య, నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఎస్ బేగ్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు , మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్,టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతాఉల్లా, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, దుర్గమ్మ గుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ అవ్వారు బుల్లబ్బాయి,ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ కూటమి నేతలు పాల్గొన్నారు..

## 'ఎస్.ఐ.ఆర్' ఓటర్ల వెరిఫికేషన్‌తో పేదల ఓట్లకు ఎసరు

**-సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తీవ్ర ధ్వజం**



**గన్నవరం,జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో 'ఎస్.ఐ.ఆర్' పేరుతో నిర్వహిస్తున్న ఓటర్ల పరిశీలన ప్రక్రియ వల్ల అర్హులైన పేద ఓటర్ల ఓట్లను పెద్ద ఎత్తున తొలగించే ప్రమాదం పొంచి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల్లో కోత పెట్టడానికే ప్రభుత్వం ఈ విధమైన కుట్రపూరిత వ్యూహాన్ని అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు.

?శనివారం గన్నవరం మండలం, బుద్ధవరం పంచాయతీ పరిధిలోని దావాజీగూడెం ప్రాంతంలో వి. శ్రీనివాసరావు పర్యటించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు రాష్ట్ర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఓట్ల వెరిఫికేషన్ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ వ్యవహారంపై చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కు సీపీఎం తరపున ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఎత్తిచూపారు:

**1. 2002 ప్రాతిపదిక -- అహేతుక నిబంధనలు**ప్రస్తుతం జరుగుతున్న వెరిఫికేషన్‌లో 2002 సంవత్సరాన్ని కట్-ఆఫ్ ఇయర్‌గా (ప్రాతిపదికగా) తీసుకోవడం అత్యంత అహేతుకమని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 2002 తర్వాత జన్మించిన వారిని పూర్వీకుల వివరాలు అడగడం, వివాహమైన మహిళలను పుట్టింటి వారి సమాచారం తేవాలని ఒత్తిడి చేయడం సామాన్య, నిరక్షరాస్య ప్రజలకు శాపంగా మారిందని ధ్వజమెత్తారు.

**2. ఆధార్, ఓటర్ ఐడీలను నిరాకరించడం** భారత ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిన, అత్యంత ప్రామాణికమైన ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, మరియు డ్రైవింగ్ లైసెన్స్‌లను క్షేత్రస్థాయి అధికారులు నిరాకరించడం దారుణమన్నారు. వీటికి బదులుగా దశాబ్దాల క్రితం నాటి విద్యా అర్హత పత్రాలు, పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను తప్పనిసరి చేయడంతో ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

**3. వలస కార్మికులు, ఇతర రాష్ట్రాల ప్రజల దయనీయ స్థితి** గత 24 ఏళ్లలో ఉపాధి నిమిత్తం ఇళ్లు మారిన వారు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన కార్మికులు 2002 నాటి రికార్డులను చూపలేక ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టప్రకారం 8 సంవత్సరాలు స్థానికంగా ఉంటే పౌరసత్వం/స్థానికత లభిస్తున్నప్పటికీ ఈ నిబంధనను అధికారులు పూర్తిగా బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు.

**4. ఆర్థిక, మానసిక ఇబ్బందులు** పాత సర్టిఫికెట్ల కోసం దళారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక, రోజువారీ కూలీ పనులు వదులుకోవాల్సి రావడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఆర్థిక, మానసిక అవస్థలకు లోనవుతున్నారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ గా ఈ అంశం పై కొన్ని డిమాండ్స్ ప్రభుత్వం, సీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ ముందు ఉంచుతున్నామని అన్నారు. అవగాహన సదస్సులు: ఈ సర్వే పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం గ్రామ, వార్డు స్థాయిలో అవగాహనా సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలి.

**ఆధార్‌కే ప్రాధాన్యత:** అతి క్లిష్టమైన పాత సర్టిఫికెట్లను అడగడం మానేసి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధార్ కార్డును ప్రాధాన్యత గుర్తింపు పత్రంగా అంగీకరించాలి.

**స్థానికతే ప్రామాణికం:** ప్రస్తుతం స్థానికంగా ఎవరైతే నివాసం ఉంటున్నారో, వారికి ఓటు హక్కు కల్పించడమే ప్రామాణికంగా వెరిఫికేషన్ సాగాలి.

**హక్కుల రక్షణ:** రాష్ట్రంలో ఏ ఒక్క అర్హుడైన పేద పౌరుడూ తన ఓటు హక్కును నష్టపోకుండా ఎన్నికల కమిషన్ వెంటనే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థానిక నాయకులు, కార్యకర్తలు కైలే ఏసుదాసు, బెజవాడ తాతబ్బాయి, కళ్ళం రాంబాబు, బడుగు మరియదాసు, కళ్ళం స్వరూప తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడ నగర పాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ గా పి. సత్యకుమారి

**విజయవాడ పశ్చిమ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థలో ఎస్ఈ (ప్రాజెక్ట్స్)గా విధులు నిర్వహించి, చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన పి. సత్యకుమారి శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను ప్రధాన కార్యాలయంలో గల కమిషనర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, సమర్థతతో పనిచేసి నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పి. సత్యకుమారి కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, నగరాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల అమలులో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

## ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రేబీస్ టీకాల శిబిరం

**మచిలీపట్నం జూలై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 6 (సోమవారం) ఉదయం 9:30 గంటల నుంచి మచిలీపట్నంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచిత రేబీస్ (పిచ్చికుక్క కాటు) నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచడం, రేబీస్ వ్యాధి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో పెంపుడు కుక్కలు, పిల్లులకు పూర్తిగా ఉచితంగా రేబీస్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.పెంపుడు జంతువుల యజమానులు తమ జంతువులను జూలై 6న ఉదయం 9:30 గంటలకు ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకువచ్చి ఉచిత టీకాలు వేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నేడు చేజర్లలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం పర్యటన



**చేజర్ల జూలై 5 (వార్తాప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆదివారం చేజర్ల మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆలయ నిర్మాణాల శంకుస్థాపనలకు ఆదివారం పర్యటన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మొదటగా ఉదయం 09.00 గంటలకు వ ం డ ల ం లో ని పెరుమాళ్ళపాడు గ్రామంలో రూ1.5 కోట్ల రూపాయలతో నిర్మించనున్న శ్రీ నాగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.అలాగేఉదయం 10.30 గంటలకుచేజర్లలో రూ.2 కోట్ల రూపాయలతో చెన్నకేశవస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.00 గంటలకుచిత్తలూరు గ్రామంలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టిన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



**అనుమసముద్రంపేట జూలై 04 (వార్తాప్రభ)** ఏ ఎస్ పేట మండలంలో ఇంటింటికి జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ను ఎంపీడీవో పి. ప్రసన్న కుమారి తాహసిల్దార్ జి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. శనివారం వారు మండల కేంద్రంలోని హైస్కూల్ రోడ్ కామాక్షి కళ్యాణ మండపం దర్గా సెంటర్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను బిఎల్వోల వద్దకు వెళ్లి సలహాలు సూచనలు అందజేశారు.అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు సవరణ ప్రక్రియ కు సంబంధించిన ఓటరు వివరాలను ఆధార్ నంబర్లు ఫోటోలు సేకరిస్తున్నారని తెలిపారు.అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బిఎల్ఓ లకు శిక్షణ ఇచ్చామన్నారు.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ లో స్థానిక ప్రజలు అవసరమైన ఆధారాలను బిఎల్వోలకు అందజేసి ఓటు హక్కు నమోదు చేసుకొని వారికి సహకరించాలని కోరారు.

## రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం




**ఇబ్రహీంపట్నం, జులై 04 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని ఈలప్రోలు గ్రామంలో రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు సహకారంతో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు కడియాల వెంకటరావు ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ సుభాని, వైద్యులు, సిబ్బంది, రామ్ కీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్వరలో బిజెపి ఎస్టీ మోర్చా కమిటీలు



**ఇబ్రహీంపట్నం, జూలై 4 (వార్తా ప్రభ ప్రతినిధి):** బీజేపీ ఎస్టీ మోర్చా కమిటీల నియామకానికి సహకరించాలని ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు జర్పాల పార్వతి కోరారు. కొండపల్లి పట్టణ బీజేపీ, కేతనకొండలోని ఇబ్రహీంపట్నం మండల బీజేపీ కార్యాలయాలను శనివారం ఆమె సందర్శించారు. కొండపల్లిలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, కేతనకొండలో బీజేపీ మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి రాము దంపతులు సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కొద్దిసేపు నాయకులతో స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యాలయాల పనితీరును అడిగి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమాల్లో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు దాము భవాని, సేనాపతి నాగమణి, కార్యదర్శి కృష్ణంరాజు, దామెర్ల నరసింహారావు, కూనాల యుగంధర్, బీజేపీ రూరల్ మండల కోశాధికారి కొమ్మూరి విఘ్నేశ్వర రావు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొమ్మూరి హనుమంతరావు, పగడాల రామాంజనేయులు, పగడాల గోపి, పత్రి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీమియం పెర్ఫార్మెన్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలోకి కీవే






**రాజమండ్రి: జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తన అత్యంత అధునాతన ఎలక్ట్రిక్ స్కూటర్ అయినటువంటి 'కీవే హైప్ వోల్ట్ ఆర్'ను ఇవాళ విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది కీవే ఇండియా. దీనితో ఈ బ్రాండ్ భారతదేశంలోని ప్రీమియం పెర్ఫార్మెన్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలోకి ప్రవేశించింది. రోజువారీ సౌలభ్యం విషయంలో రాజీ పడకుండా, ఉత్తేజకరమైన పనితీరును కోరుకునే రైడర్ల కోసం రూపొందించబడిన హైప్ వోల్ట్ ఆర్, ఆకర్షణీయమైన స్టైలింగ్, అత్యాధునిక సాంకేతికత మరియు తెలివైన ఇంజనీరింగ్‌లను ఒక ఆకట్టుకునే ప్యాకేజీగా మిళితం చేస్తుంది. ఈ స్కూటర్ ప్రారంభ ధరని రూ.1,99,000 (ఎక్స్-షోరూమ్) గా నిర్ణయించారు. కీవే హైప్ వోల్ట్ ఆర్ క్రిస్టల్ వైట్ మరియు ప్లాటినం గ్రే రంగులలో లభిస్తుంది. వినియోగదారులు కీవే ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా రూ.5,000 చెల్లించి ఈ స్కూటర్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. సంప్రదాయ ఎలక్ట్రిక్ స్కూటర్లకు మించిన రైడింగ్ అనుభవాన్ని అందించేలా హైప్ వోల్ట్ ఆర్ ని రూపొందించారు. దీని తక్షణ థ్రాటిల్ స్పందన, వేగవంతమైన యాక్సిలరేషన్ మరియు పవర్ డెలివరీతో అద్భుతమైన పనితీరును సృష్టిస్తుంది. ఇది ఇవాళ భారతదేశంలో అందుబాటులో ఉన్న అత్యంత ఉత్తేజకరమైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఒకటిగా నిలుస్తుంది. హైప్ వోల్ట్ ఆర్ యొక్క ప్రధాన భాగంలో 5 కే డబ్ల్యూ హెచ్ డ్యూయల్ బ్యాటరీ ఆర్కిటెక్చర్ ఉంది. ఇదిఐడీసీ ధృవీకరించిన 180 కిలోమీటర్ల రైడింగ్ రేంజ్‌ను అందిస్తుంది. ఇందులో సమాంతరంగా తీసివేయగల బ్యాటరీ ప్యాక్‌లు ఉంటాయి. వీటిని వాహనంపై లేదా వాహనం నుండి వేరు చేసి సౌకర్యవంతంగా ఛార్జ్ చేయవచ్చు. ఇది ఆధునిక పట్టణ ప్రయాణికులకు సాటిలేని సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ బ్యాటరీ సిస్టమ్ వాహనంలోనే ఛార్జింగ్‌కు మద్దతు ఇస్తుంది, సుమారు 3 గంటల్లో 80 శాతం ఛార్జింగ్ పూర్తవుతుంది. పనికి అంతరాయం కలిగే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తూ, సౌకర్యాన్ని పెంచుతుంది.

# రెడ్డిగూడెంలో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం



**రెడ్డిగూడెం,జులై 4(వార్తాప్రభ ప్రతినిధి ):**రెడ్డిగూడెం గ్రామంలో విద్యార్థులు, యువత మరియు గ్రామస్తులకు సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, మహిళలు-బాలికల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం జరిగింది.ఎన్‌టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రూరల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ, ఐపీఎస్ పర్యవేక్షణలో, ఇన్‌చార్జ్ ఏసీపీ రామచంద్రరావు మార్గదర్శకత్వంలో, మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు ఆధ్వర్యంలో, రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఈ రోజు (04-07-2026) రెడ్డిగూడెం గ్రామంలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులకు సైబర్ నేరాల నివారణ,ఫోక్సో చట్టం, మహిళలు మరియు బాలికల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రెడ్డిగూడెం ఎస్ఐ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరగాళు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ATM PIN, CVV, UPI PIN వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోరాదని సూచించారు. లోన్ యాప్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్‌లు, నకిలీ ఉద్యోగాలు, ఆన్‌లైన్ షాపింగ్, లాటరీలు, బెట్టింగ్ యాప్‌లు వంటి పేర్లతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు.అలాగే తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు లేదా ఏపీకే ఫైల్‌లను ఓపెన్ చేయకుండా వెంటనే తొలగించాలని, ఏవైనా అనుమానాలు ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా సైబర్ హెల్ప్‌లైన్ 1930 ను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేయవచ్చని తెలియజేశారు.అదేవిధంగా ఫోక్సో చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించి, మైనర్ బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ద్వారా ఏర్పడే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు మంచి-చెడు స్పర్శ గురించి చిన్న వయస్సు నుంచే తెలియజేయాలని, తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ, మొబైల్ ఫోన్ వినియోగం మరియు సోషల్ మీడియా కార్యకలాపాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.విద్యార్థులు తమ వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదని, సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తులను నమ్మి వ్యక్తిగతంగా కలుసుకోవద్దని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత మరియు గ్రామస్తులు సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అనేక సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో నేరాల నివారణకు ఎంతో దోహదపడతాయని పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కోటలో కొలువు... కోట్ల విలువైన భూములపై కన్ను

**దర్జాగా కబ్జాల పర్వం... భార్య పేరిట రికార్డులు**
**ఇంతకీ ఎవరు ఈ సిద్ధయ్య... ఏమిటీ ఈ కబ్జాల కథ**





**చంద్రగిరి,జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి):** చారిత్రాత్మక చంద్రగిరి కోటలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి భూముల కబ్జాలకు పాల్పడ్డాడంటూ వెలుగులోకి వచ్చిన ఆరోపణలు స్థానికంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఆర్కియాలజీ శాఖలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంఎటీఎస్)గా పనిచేస్తున్న సిద్ధయ్య, కోట సమీపంలోని విలువైన భూములను అక్రమంగా ఆక్రమించి, రెవెన్యూ అధికారుల సహకారంతో తన భార్య బద్దల లలితమ్మ పేరిట ఆన్‌లైన్ రికార్డులు నమోదు చేయించుకున్నాడని బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.బాధితుల కథనం ప్రకారం, చంద్రగిరి కోట గ్రామానికి చెందిన మండలనేని వంశస్థులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను వివిధ కారణాలతో కొంతకాలం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిన అవకాశాన్ని ఆసరాగా చేసుకున్న సిద్ధయ్య, ఆ భూములపై తన హక్కు ఉన్నట్లు ప్రచారం చేస్తూ క్రమంగా కబ్జాలకు తెరతీశాడని చెబుతున్నారు. అంతేకాకుండా, సంబంధం లేని భూములను సైతం తన భార్య పేరుతో అనువంశిక హక్కులుగా నమోదు చేయించుకోవడం వెనుక భారీ అక్రమాలు జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.రెవెన్యూ అధికారులను ప్రభావితం చేసి ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పులు చేయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు భూమి యజమానులు తమ పొలాలకు వెళ్లినా, సిద్ధయ్య అక్కడికి చేరుకుని "మీ వద్ద రికార్డులు ఉన్నాయా?" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితులు వాపోతున్నారు. తమ పూర్వీకుల భూములకు తామే రికార్డులు చూపించాలా అని ప్రశ్నిస్తే, "నా రికార్డులు మీకు చూపించను... రెవెన్యూకే చూపిస్తాను" అంటూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. అయితే, రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినప్పుడు మాత్రం విచారణకు హాజరు కాకుండా తప్పించుకుం టున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల తాను కబ్జా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి సిద్ధమవగా, సమాచారం అందుకున్న అసలు యజమానులు అక్కడికి చేరుకుని నిలదీశారు. అదే సమయంలో మీడియా కూడా సంఘటనా స్థలానికి చేరుకోవడంతో సిద్ధయ్య అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు.ఈ సందర్భంగా బాధితులు తమ వద్ద ఉన్న ఆన్‌లైన్ రికార్డులు, సంబంధిత పత్రాలను మీడియాకు చూపిస్తూ, తమ భూములను అక్రమంగా బద్దల లలితమ్మ పేరిట నమోదు చేశారని ఆరోపించారు. ఈ ఆన్‌లైన్ మార్పులు ఏ ఆధారాలతో జరిగాయి? ఎవరి అనుమతితో నమోదు చేశారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారులు వెంటనే విచారణ చేపట్టి అక్రమంగా జరిగిన ఆన్‌లైన్ నమోదులను రద్దు చేసి, అసలు యజమానుల పేర్లపై రికార్డులు పునరుద్ధరించి పాసుబుక్కులు మంజూరు చేయాలని మండలనేని వంశస్థులు కోరుతున్నారు. సుమారు మూడున్నర ఎకరాల విలువైన భూమిని సిద్ధయ్య అక్రమంగా కబ్జా చేశాడని వారు ఆరోపిస్తున్నారు.

# ఫుట్ పాత్ లపై ఆక్రమణలు తొలగించిన మున్సిపల్




**శేరిలింగంపల్లి,జూలై 4 (వార్తాప్రభ):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వాక్ ఫ్రీ' ప్రత్యేక డ్రైవ్‌లో ఆల్విన్ ఎక్స్‌రోడ్డు నుంచి బీహెచ్‌ఈఎల్ ఎక్స్‌రోడ్డు వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు.మియాపూర్ సర్కిల్-48 పరిధిలో డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో టౌన్ ప్లానింగ్ అధికారులు,పోలీసు శాఖ సంయుక్తంగా ఈ చర్యలు చేపట్టారు. పాదచారులకు అంతరాయం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించి ఫుట్‌పాత్‌లను వినియోగానికి అనువుగా తీర్చిదిద్దారు.సైబరాబాద్ వ్యాప్తంగా దశలవారీగా 'వాక్ ఫ్రీ' కార్యక్రమాన్ని కొనసాగించి, ఆక్రమణల రహిత ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని కమిషనర్ తెలిపారు.

# ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన ముఖ్యం

- ఈ-వేదికలను సద్వినియోగం చేసుకోండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఇబ్రహీంపట్నం, జులై 04(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను చేరుకోవాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం జరిగిన హస్తకళా ఉత్పత్తుల తయారీ వర్క్‌షాప్‌తో పాటు ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి.. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు, చేతివృత్తిదారులు ఈ-కామర్స్ వేదికలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా తమ ఉత్పత్తులను స్థానిక మార్కెట్‌కే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విక్రయించే అవకాశం కలుగుతుందన్నారు. డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రచారం, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాపార అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఉత్పత్తుల నాణ్యత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, సరైన బ్రాండింగ్‌తో పాటు ఆన్‌లైన్ ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావుతో పాటు స్టెల్లా కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు

## పాఠశాలలో పిఎంశ్రీ నిధులు విద్యాసామాగ్రి వినియోగంపై పరిశీలన



**సంగం జూలై 04(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పీ హైస్కూల్‌ను సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ వెంకట సుబ్బయ్య ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాలలో గత రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అందించిన పీఎం శ్రీ నిధులు విద్యా సామగ్రి వినియోగంపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీసీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో మొత్తం 46 పీఎం శ్రీ పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల ప్రగతి విద్యా ప్రమాణాలను అంచనా వేసేందుకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాఠశాలలకు అందించిన విద్యా సామగ్రి వినియోగంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల విద్యా నైపుణ్యాలు ఎంత మేరకు మెరుగుపడ్డాయో సమీక్షిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఏఎస్పీ డీఈఓ ఏపీసీ ఏఎంఓ తదితర అధికారులతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించి తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. పాఠశాల నగదు పుస్తకాలతో పాటు అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తనిఖీల్లో గుర్తించిన లోపాలను విజిటర్స్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు సంబంధిత యాప్‌లో కూడా అప్‌లోడ్ చేస్తున్నామని ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ జానకిరామ్ ఎంఈఓ మల్లయ్య హెడ్మాస్టర్ బుజ్జయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, జులై 04 (వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను ప్మండల విద్యాశాఖ అధికారిని, సిహెచ్ పుష్పలత మరియు ఫాబ్రిక్స్ అధినేతలు ప్రారంభించారు. సామాజిక బాధ్యతల భాగంగా ఫాబ్రిక్స్ కంపెనీ పాఠశాల సంబంధించిన,మౌలిక వసతులు,నూతన బోర్ వెల్, మోటర్, మరుగుదొడ్లు కు మరమ్మత్తులు చేయించి రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. ఫాబ్రిక్స్ బోడేపూడి అప్పారావు, వారి మనవడు నిఖిల్, పాఠశాల పాఠశాలకు సిబ్బంది ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థ ప్రతినిధి సురేష్ వర్మ మాట్లాడుతూ స్థానికంగా సామాజిక బాధ్యత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డి.నిర్మల వాణి, ఉపాధ్యాయులు, ఫ్యాబ్రిక్స్ ప్రతినిధులు డి రవి,సి ఆర్ పి నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## చరిత్రలో రంగా పేరు చిరస్మరణీయం

**కొండపల్లిలో రాధా-రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో వంగవీటి రంగా జయంతి వేడుకలు**




**ఇబ్రహీంపట్నం, జులై 04 (వార్తా ప్రభ ప్రతినిధి):** చరిత్రలో ఎప్పటికీ వంగవీటి మోహన రంగా పేరు చిరస్మరణీయం అని నినాదించారు ఆయన అభిమానులు.పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన యోధుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ రంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో బి కాలనీ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పేదల గుండెల్లో అనేప్పటికీ జీవించి ఉంటారని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్తాఫ్ బాబా, కో-ఆప్షన్ సభ్యులు యర్రంశెట్టి నాని, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చెరుకుమల్లి రాధిక, రాధా రంగా మిత్రమశీడలి నాయకులు అడపా శివ, అశోక్ బాబి,దూడల ఈశ్వర్, గోపి, రమేష్, సాయి, రేవంత్, ప్రసాద్,దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ రంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

● గుడివాడలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు.. ఏజికే స్కూల్ సెంటర్‌ను రంగా చౌక్‌గా అభివృద్ధి చేస్తామనీ ఎమ్మెల్యే రాము హామీ.. !





**గుడివాడ,జూలై 4 (వార్తాప్రభ) :** స్వర్గీయ వంగవీటి మోహనరంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరం యువతకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలను కూటమి పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఏజికే స్కూల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి అధ్యక్షుడు పండ్రాజు సాంబశివరావు, కూటమి పార్టీల నాయకులు దారపు రెడ్డి మనీశ్వరరావు, పందిళ్ళ మల్లీ, చేకూరు జగన్మోహన్రావు, సందు పవన్, దేవాది నాగేశ్వరరావు, పంచకర్ల అమర్, వడ్డే గిరి, వాసే మురళి, గుత్తా చంటి, యార్లగడ్డ సుధారాణి, కంచనపల్లి సుబ్రమణ్యం, వడ్డాది నాగరాజు, వసంతవాడ దుర్గారావు, బలసాని భవాని, రమేష్ చౌదరి, దాసరి మహేష్, పాండు, ఇమాన్యుల్, పంచకర్ల మహేష్, మాదాల సురేష్, షణ్ముఖ రెడ్డి, పంచమర్తి శ్రీనివాసరావు, దారపురెడ్డి మహేశ్వరరావు, గొర్ల శ్రీలక్ష్మి, వంగకుండు ఆదినారాయణ, పోలసీ ఉమా, మద్దుకూరి ప్రభాకర్, బొంబాయి శ్రీను, మరీదు రోహిణ్, ఎస్‌కే మౌలాలి, సయ్యద్ జబీన్, పాండు, పులవర్తి డేవిడ్, కొడాలి రాజా, సమ్మెట వరుణ్, గుర్రాల అరవింద్, పైడిముక్కల వంశీ తదితరులు పాల్గొన్నారు.

**గుడివాడ వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో.. :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా 79వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక రాజేందర్ నగర్ లోని వైయస్సార్ సిపి కార్యాలయంలో కొడాలి నాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాలేటి చంటి, ఎం.వి నారాయణరెడ్డి, అడబాల అప్పారావు పలువురు నేతలు రంగ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఫర్నిచర్ పార్క్ బెన్ను, వడ్లాని సుధాకర్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, గంటా సురేష్, సింహాద్రి రాంబాబు, చుండూరి శేఖర్, అల్లం రామ్మోహన్, గంటా శీను, వంగలపూడి కనక బాబు, కలపాల కిరణ్, మెండా కిరణ్, కారే జోసెఫ్, ఎస్ కే బాజీ, షేక్ సయ్యద్, దుడ్డు చిన్న, అలీ బేగ్, గుడే రవి, జ్యోతుల మణికంత, తోట సాయి, నరేంద్ర, నారాయణరెడ్డి, జోషి, వెంపల అప్పారావు, జిఎస్టి భాష, అబ్దుల్ రజాక్, ఖాదర్ బేగ్, షఫీ, చింతా నాని, అడపా హర్ష, వన్నెంరెడ్డి దినేష్, సుంకర ప్రసాద్, తరుణ్, ఎన్ హర్ష, బ్రో నాగేంద్ర, నైనవరపు శేషు, రమణ కుమార్, జ్యోతుల సత్యవేణి, సురేఖ, హారిక, రమీజా, శేషం నిర్మల, రాణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

**జనసేన పార్టీ కార్యాలయంలో.. :** శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వర్గీయ శ్రీ వంగవీటి మోహన్ రంగా గారి 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముందుగా పలువురు నేతలు రంగ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి కొదమల గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, షేక్ మీరా షరీఫ్, సుంకర వెంకట్, సీతారాం, లోయ రాజా, సూద బత్తుల వెంకటేష్, జనపాల కిరణ్ కుమార్, దాసరి మహేష్, తోట వెంకటేష్, ప్రసాద్, అడపా విశాల్, జాజుల సురేష్ మరియు వీర మహిళలు కోన శిరీష, గేదల కళ్యాణి, కల్పన, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

**కాపు సేవా సమితి ఆధ్వర్యంలో.. :** శనివారం స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 79వ జయంతిని పునస్కరించుకొని స్థానిక ఏ జీకే స్కూల్ దగ్గరలోని వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి గుడివాడ కాపు సేవా సమితి తరుపున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షులు ముదిదాని సత్యనారాయణ, సెక్రెటరీ ఆత్మూరి సత్యనారాయణ, ఫౌండర్ పొన్నూరు రామకృష్ణ, పూర్వాధ్యక్షులు సుంకర గాంధీ, నల్లగంచు రాంబాబు, పంచకర్ల వెంకట్, నోబుల నాయుడు, మహంకాళి వీర శేఖర్, కోఆర్డినేటర్ గంటా చంద్రశేఖర రావు, పంజల శ్రీనువాస రావు, సాయన గాంధీ, సాయన రాజేష్, వెంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు



**గుడివాడ,జూలై 4 (వార్తాప్రభ) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను గుడివాడ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వైశ్య సంఘ పెద్దలతో కలిసి డైరెక్టర్ సునీల్ రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సునీల్ మాట్లాడుతూ రోశయ్య శాసనమండలి సభ్యుడిగా, ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారనీ అన్నారు. ముఖ్యంగా ఆర్థిక మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజీ గంగరాజు, వైశ్య సంఘ పెద్దలు బెజవాడ బాజేశ్వరావు, పైడి గోపి, చలువాది సురేష్, వనిత విదర్భపురి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విప్లవ వీరుడు అల్లూరి జయంతి వేడుకలు



**గుడివాడ,జూలై 4 (వార్తాప్రభ) :** గుడివాడ క్షత్రియ సేవాసమితి, అల్లూరి సీతారామరాజు స్మారక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు వెయ్యికి పైగా ఆహార పొట్లాలను పాదచారులకు పంచారు. ఈ కార్యక్రమంలో గుడివాడ క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు కోసూరి రవిరాజు, స్మారక కమిటీ గౌరవ సలహాదారు గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ లంక దాసరి ప్రసాదరావు, సంఘ ఉపాధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కర రాజు, రుద్రరాజు విజయ్ కుమార్ రాజు, నాగవర్ధన రాజు, సాగిరాజు గజపతిరాజు, నందూరి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దాయిగుంట హై స్కూల్ నందు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



**హనుమాన్ జంక్షన్,జూలై 4 (వార్తాప్రభ) :** మద్దాయి కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయుల దారపురెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన, తెలుగు తేజం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు భాస్కరరావు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలు నిర్వహించారు. 1897 జూలై 4న అల్లూరి సీతారామరాజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని మోగల్లు గ్రామంలో జన్మించి రాజమండ్రి నరసాపురం తణుకు కాకినాడలో విద్యాభ్యాసం చేసి నాటకాల్లో చురుగ్గా పాల్గొనేవారు. కలకత్తా కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని దేశమంతటా తిరిగి అనేక మందిని కలుసుకుని తూర్పుగోదావరి జిల్లా రంప ప్రాంతంలో గిరిజన ఆరోగ్య, సామాజిక,ఆర్థిక సమస్యలు కోసం బ్రిటిష్ అధికారులను ఎదిరించి మన్యం విప్లవాన్ని నడిపారు. 1922 నుంచి1924 వ సంవత్సరశీ లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం భారత స్వతంత్ర ఉద్యమం కోసం నడుం బిగించిన గొప్ప ధీరుడు, దేశభక్తుడు, సీతారామరాజు అని, నేటి తరశీ విద్యార్థులు ఆయన ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల కే నవ్య, బి జ్యోతి,బి జూన్సన్, టి యువరాజు, టి టి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, గుడివాడ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



**గుడివాడ,జూలై 4 (వార్తాప్రభ) :** మానవతా సంస్థ ఆధ్వర్యంలో కాకర్ల లక్ష్మేశ్వరరావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఎజికే స్కూల్ పక్కన ఉన్న అన్నా క్యాంటీన్లో నిరుపేదలకు భోజనాలు, వృద్ధులకు పంచె టవల్ మరియు మమతా వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, పండ్లు అలాగే పిల్లలకు దుప్పట్లు పండ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరు వీర శేషగిరిరావు, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి గుడివాడ శాఖ అధ్యక్షులు నందమూరి పద్మజ కార్యదర్శి చింతలూరు సత్యనారాయణ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కన్వీనర్ గోపిరెడ్డి, కోశాధికారి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ చలువాది మోహన్ రావు, డైరెక్టర్లు దండమూడి సీతారామస్వామి, కొమ్ము వెంకటేశ్వరరావు, శైలజ, శ్రీ లక్ష్మీ, శ్రావ్యా, ప్రమిత్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ గురుకులంలో డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో క్రీడా మైదానం శుభ్రత





**గూడూరు,జూలై 4 (వార్తాప్రభ) :** నెల్లూరు జిల్లా, గూడూరు శనివారం తేదీన రెండో పట్టణంలోని ఏపీ టీ డబ్ల్యూ ఆర్ మినీ గురుకులం నందు క్రీడా ప్రాంగణం గడ్డి , ముళ్ళకంపలు పెరిగి విద్యార్థునులు క్రీడలకు ఆడేందుకు ఇబ్బందిగా ఉన్నదని మినీ గురుకులం హెడ్ మాస్టర్ కె వి రజిని కుమారి తెలపగా శ్రీకృష్ణ సేవాసమితి ఫౌండర్ చైర్మన్ మరియు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందర్ రావు(మయూరి శ్యామ్ యాదవ్) క్రీడా మైదానాన్ని శుభ్రపరచడం జరిగింది. కార్యక్రమాన్ని మినీ గురుకులం హెడ్మాస్టర్ రజనీకుమారి, పి ఈ టి నాగూరమ్మ పర్యవేక్షించారు.

## ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం



**నూజివీడు,జూలై 4 (వార్తాప్రభ) :** జులై 4వ తేదీ నూజివీడు రోటరీ ఆడిటోరియం లో రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్, నూజివీడు వారి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్,హైదరాబాద్ వారి ద్వారా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. 300 మంది రోగులకు వివిధ వైద్య పరిక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి తదుపరి పరిక్షలకు వైద్యులు సిఫార్సు చేసారు. ఈ కార్యక్రమం లొ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బోయపాటి ముఖర్జీ, సెక్రెటరీ మల్లిసెట్టి శ్రీనివాస్,రోటరీ సభ్యులు సజ్జా శశికాంత్, మండా శ్రీనివాస్, యార్లగడ్డ రాజగోపాల్, పొట్లూరి ప్రసాద్ ,లావు మురళి, దోనేపూడి నరేంద్ర, శొభనాద్రి, పైడి అనీల్, భీమ శంకర రావు, బొద్దు రామారావు మరియు బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డా. రవిశంకర్, డా శ్రీ వల్లి, డా. సురేఖ, రేడియాలజిష్టు డా. గిరీష్ బాబు,మేనేజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.మంచి ఆహారపు అలవాట్లతో జంక్ ఫుడ్స్ ని తీసుకోకుండా వుండాలని, దూమపానం, మద్యపానం, మారక ద్రవ్యాలకు, పొగాకు, తంబాకు వంటి వాటికీ దూరంగా వుండాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలని, పరిసరాల మరియు శరీర పరిశుభ్రత వంటి జాగ్రత్తలతో కాన్సర్ వంటి వ్యాదులబారి పడకుండా వుండవచ్చని కాన్సర్ హాస్పిటల్ డాక్టర్స్ రవిశంకర్, శ్రీవల్లి, సురేఖ తెలిపారు..

## తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన విప్లవ జ్యోతి అల్లూరి



**కలిదిండి,జూలై 4 (వార్తాప్రభ) :** మన్యం ప్రజల ఆరాధ్య దైవం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను కలిదిండి మానవతా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలిదిండి మానవతా శాఖ అధ్యక్షులు పోకల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ "మన్యం ప్రజల గుండెల్లో దైవంగా, తెల్లదొరల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన వీరుడు అల్లూరి సీతారామరాజు. కేవలం 27 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ సామ్రాజ్యాన్నే గడగడలాడించిన చరిత్ర ఆయనది. విల్లంబులు, సాంప్రదాయ ఆయుధాలతోనే ఆధునిక తుపాకులు కలిగిన ఆంగ్లేయులను ఎదిరించిన అల్లూరి పోరాట స్ఫూర్తి ప్రపంచ చరిత్రలోనే అరుదైనది. ఆయన చూపిన ధైర్యం, దేశభక్తి దేశచరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయి" అని కొనియాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులు నూకల శ్యామలరావు గుప్తా, మానవతా శాఖ చైర్మన్ పెటేటి వివేకానంద గురుస్వామి, కన్వీనర్ గోదావరి సత్యనారాయణ, గౌరవ డైరెక్టర్ మారుబోయిన రత్నారావు, ప్రధాన కార్యదర్శి ఓడుపు రమేష్, వేణు, కార్యవర్గ సభ్యులు, మానవతా శాఖ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై అల్లూరి కి ఘన నివాళులు అర్పించారు.

## పేద ప్రజల గుండెల్లో వంగవీటి మోహన రంగా స్థానం పదిలం..








**కృత్తివెన్ను,జూలై 4 (వార్తాప్రభ) :** పేద ప్రజల గుండెల్లో వంగవీటి మోహన రంగా స్థానం శాశ్వతంగా ఉంటుందని కుటమి నాయకులు గ్రామ స్థానికులు అన్నారు శనివారం వంగవీటి మోహన రంగా 79 వ జయంతి వేడుకలు సందర్భంగా ఎండపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో రంగ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు బడుగు బలహీనుల వర్గాలకు ధైర్యన్ని ఇచ్చిన నాయకుడు రంగా అన్నారు రాష్ట్ర రాజకీయాల్లో ఆయన స్థానం సుస్థిరంగా ఉందని కొనియాడారు ఆయన సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నేశీటి రత్తయ్య బత్తుల పూర్ణ పిన్నెంటి ముత్యాలరావు దాసరి శ్రీను కొప్పర్తి శ్రీ రామమూర్తి ఈమన రాంబాబు కన్నా సత్యం పి లక్ష్మణ్ బాబు పి నాగ ప్రసాద్ పూర్ణ ముత్యాల వెంకన్న తోట నాగు జన్యావుల నాగబాబు చంద్రల సుబ్బారావు పి శ్రీను పి కృష్ణ కే అంజి కే ధర్మారావు పోతురాజు కూటమి నాయకులు గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## బెజవాడ బొబ్బిలి రంగా జయంతి వేడుకలు



**కోడూరు,జూలై 4 (వార్తాప్రభ) :** కోడూరు ప్రధాన సెంటర్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బొబ్బిలి వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు రంగా జీవితంలో కుల మతాలకతీతంగా ప్రజలకు అందించిన తోడ్పాటు గురించి, ఆయన ఎదుగుదల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు రంగా అభిమానులు పాల్గొన్నారు.



శనివారం ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు స్వర్గీయ శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వారికి ఘనమైన నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొదమల గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, షేక్ మీరా షరీఫ్, సుంకర వెంకట్, సీతారాం, లోయ రాజా, సూద బత్తుల వెంకటేష్, జనపాల కిరణ్ కుమార్, దాసరి మహేష్, తోట వెంకటేష్, ప్రసాద్, అడపా విశాల్, జాజుల సురేష్ వీర మహిళలు కోన శిరీష, గేదల కళ్యాణి, కల్పన, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,జూలై 4 (వార్తాప్రభ) :

# కథ ముగిసినా....పేరు మారలేదు..

● మోపిదేవి మండలంలో అధికారుల పర్యవేక్షణ తీరుపై ఆక్షేపణ.



**మోపిదేవి/అవనిగడ్డ,జూలై 4 (వార్తాప్రభ) :** మోపిదేవి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, కార్యకలాపాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ వైఫల్యం విమర్శలకు తావిస్తోంది.ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు సైతం క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం అధికారుల నిరంతర పర్యవేక్షణలో నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది.గత వైకాపా ప్రభుత్వ హయాంలో వైయస్సార్ రైతు భరోసా కేంద్రం పేరుతో సేవలందించిన ఆర్బికె ల పేరును ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలోనే " రైతు సేవా కేంద్రం " గా మార్పు చేసి ఆ మేరకు క్షేత్రస్థాయిలో సదరు మార్పులను అమలు చేయాలని అధికారికంగా గెజిట్ ఉత్తర్వులు జారీచేసింది.సదరు ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని చోట్లా అమలవుతున్నా మోపిదేవి మండలంలో మాత్రం అమలుకు నోచుకోలేదు.మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లి గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన అడపా వారి పాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రంను ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా వైయస్సార్ రైతు భరోసా కేంద్రం పేరుతోనే కొనసాగిస్తున్నారు.ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయకుండా పాత పేరునే కొనసాగించడంలో విధినిర్వహణలో నిర్లక్ష్యమా ? లేక గత ప్రభుత్వంపై అవ్యాజమైన అభిమానమా అని అధికారుల తీరును స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి మోపిదేవి మండలంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## తారకరామా, తెలుగు మహిళా వాకర్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు..



**గుడివాడ,జూలై 4 (వార్తాప్రభ) :** శనివారం తారకరామా వాకర్స్ క్లబ్, తెలుగు మహిళా వాకర్స్ క్లబ్ లు సంయుక్తంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి 27 ఏళ్ల చిన్న వయసులోనే అధునాతన ఆయుధాలు ఉన్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తన గెరిల్లా యుద్ధ తంత్రాలతో గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, తెలుగు రాష్ట్రాల గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు మరియు భారత జాతీయ పతాక రూపశిల్పి స్వతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య వర్ధంతి మరియు యువతకు ఆత్మవిశ్వాసం నూరిపో సిన మహానేత స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమము లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తారకరామా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బచ్చు రాధాకృష్ణ, తెలుగు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, తారకరామా వాకర్స్ క్లబ్ ఫౌండర్ దండమూడి సీతారా మస్వామి, మాజీ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య, రామకృష్ణ పి.వి. లక్ష్మయ్య, యార్లగడ్డ సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ పి నాంచారయ్య, చల్లా ఈశ్వరి దేవి, ఎస్.శారదా తదితరులు పాల్గొన్నారు.

# ప్రీమియం పెర్ఫార్మెన్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలోకి కీవే






**విజయవాడ,జూలై 4 (వార్తాప్రభ) :** తన అత్యంత అధునాతన ఎలక్ట్రిక్ స్కూటర్ అయినటువంటి 'కీవే హైప్ వోల్ట్ ఆర్'ను ఇవాళ విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది కీవే ఇండియా. దీనితో ఈ బ్రాండ్ భారతదేశంలోని ప్రీమియం పెర్ఫార్మెన్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలోకి ప్రవేశించింది. రోజువారీ సౌలభ్యం విషయంలో రాజీ పడకుండా, ఉత్తేజకరమైన పనితీరును కోరుకునే రైడర్ల కోసం రూపొందించబడిన హైప్ వోల్ట్ ఆర్, ఆకర్షణీయమైన స్టైలింగ్, అత్యాధునిక సాంకేతికత మరియు తెలివైన ఇంజనీరింగ్‌లను ఒక ఆకట్టుకునే ప్యాకేజీగా మిళితం చేస్తుంది. ఈ స్కూటర్ ప్రారంభ ధరని రూ.1,99,000 (ఎక్స్-షోరూమ్) గా నిర్ణయించారు. కీవే హైప్ వోల్ట్ ఆర్ క్రిస్టల్ వైట్ మరియు ప్లాటినం గ్రే రంగులలో లభిస్తుంది. వినియోగదారులు కీవే ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా రూ.5,000 చెల్లించి ఈ స్కూటర్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. సంప్రదాయ ఎలక్ట్రిక్ స్కూటర్లకు మించిన రైడింగ్ అనుభవాన్ని అందించేలా హైప్ వోల్ట్ ఆర్ ని రూపొందించారు. దీని తక్షణ థ్రాటిల్ స్పందన, వేగవంతమైన యాక్సిలరేషన్ మరియు పవర్ డెలివరీతో అద్భుతమైన పనితీరును సృష్టిస్తుంది. ఇది ఇవాళ భారతదేశంలో అందుబాటులో ఉన్న అత్యంత ఉత్తేజకరమైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఒకటిగా నిలుస్తుంది. హైప్ వోల్ట్ ఆర్ యొక్క ప్రధాన భాగంలో 5 కే డబ్ల్యూ హెచ్ డ్యూయల్ బ్యాటరీ ఆర్కిటెక్చర్ ఉంది. ఇది ఐడీసీ ధృవీకరించిన 180 కిలోమీటర్ల రైడింగ్ రేంజ్‌ను అందిస్తుంది. ఇందులో సమాంతరంగా తీసివేయగల బ్యాటరీ ప్యాక్‌లు ఉంటాయి. వీటిని వాహనంపై లేదా వాహనం నుండి వేరు చేసి సౌకర్యవంతంగా ఛార్జ్ చేయవచ్చు. ఇది ఆధునిక పట్టణ ప్రయాణికులకు సాటిలేని సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ బ్యాటరీ సిస్టమ్ వాహనంలోనే ఛార్జింగ్‌కు మద్దతు ఇస్తుంది, సుమారు 3 గంటల్లో 80 శాతం ఛార్జింగ్ పూర్తవుతుంది. పనికి అంతరాయం కలిగే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తూ, సౌకర్యాన్ని పెంచుతుంది.

# విజయవాడ వేదికగా తొలిసారిగా 'స్టేట్ ఐకాన్స్ అవార్డ్స్--2026'

● అవార్డుల ఫ్లయర్ ఘనంగా ఆవిష్కరణ ● నెలాఖరులో ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానోత్సవం






**విజయవాడ,జూలై 4 (వార్తాప్రభ) :** వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి సత్కరించేందుకు స్టేట్ ఐకాన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'స్టేట్ ఐకాన్స్ అవార్డ్స్--2026' కార్యక్రమానికి సంబంధించి అధికారిక ఫ్లయర్‌ను శనివారం విజయవాడ ఎంజీ రోడ్డులోని ఆదిత్య బిర్లా ఇంద్రియ జ్యువెలర్స్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఇంద్రియ జ్యువెలరీ వెన్యూ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో స్టేట్ ఐకాన్స్ ఫోరం అధ్యక్షుడు చైతన్య జంగా, ప్రధాన కార్యదర్శి జయా పటేరియా మాట్లాడుతూ, విజయవాడ వేదికగా తొలిసారిగా స్టేట్ ఐకాన్స్ అవార్డ్స్ నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో నగరంలోని హయత్ ప్లేస్ హోటల్‌లో అవార్డుల ప్రదానోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజంలో తమ తమ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులను గుర్తించి, వారి సేవలను గౌరవించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యాపారం, కళలు, సాంస్కృతికం, మీడియా, సామాజిక సేవ, క్రీడలు తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడం, సేవాభావంతో పనిచేస్తున్న వారికి తగిన గుర్తింపు కల్పించడం, యువతకు స్ఫూర్తినిచ్చే విజయగాథలను సమాజానికి అందించడం ఈ అవార్డుల ముఖ్య లక్ష్యమని వారు వివరించారు. భవిష్యత్తులో ఈ అవార్డులను మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు విశ్వసనీయ గుర్తింపుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ ఐకాన్స్ అవార్డ్స్--2026 అధికారిక ఫ్లయర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిస్ ఇండియా చార్మింగ్ ఫేస్ అనయ కశ్యప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఐకాన్స్ ఫోరం ఉపాధ్యక్షులు మిత్తాన ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ కోడె శ్రీ చైతన్య, ట్రెజరర్ ఆర్.వి. అప్పా రావు, ఏపీ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మంథా శ్రీనివాస్, బీజేపీ మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ సిరి కిరణ్, బిగ్‌బాస్ ఫేమ్ షానీ సాల్మన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# హనుమాన్ జంక్షన్ లో ఘనంగా జరిగిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు జన్మదిన వేడుకలు





**హనుమాన్ జంక్షన్,జూలై 4 (వార్తాప్రభ) :** లక్షా యాభై వేల పాడి కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం చలసాని ఆంజనేయులు జన్మదినం సందర్భంగా హనుమాన్ జంక్షన్ కాకాని కళ్యాణ మండపంలో 60 వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. తొలుత ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలో కేకు కోసి చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం కాకాని కళ్యాణ మండపంలో ఎన్టీ రామారావు, కాకాని వెంకటరత్నం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత హనుమాన్ జంక్షన్ క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు ఆధ్వర్యంలో పాల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బంది జన్మదిన వేడుకలను ఘనంగా ప్రారంభించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు అభిమానుల, జర్నలిస్టుల సమక్షంలో అభిమానులు అందంగా రూపొందిన కేకు ను కట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు పూల దండలు,బోకెలతో శాలువాలతో చలసానిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యనమదల రమేష్, బొడ్డు రామచంద్రరావు, పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్, లయన్ గూడపాటి రత్న శేఖర్, మాదాల శ్రీనివాసరావు, గుండపనేని ఉమా ప్రసాద్, లయన్ తాడి రంగారావు,రొంపల్లి అచ్యుత రావు,వేగిరెడ్డి నాని, కొల్లి వెంకట్రావు, చలసాని రాజా,నందిగం స్వామి, వీరం రాంబాబు, మిక్కిలినేని ఈశ్వరరావు, హనుమంతు నాగేశ్వరరావు, లయన్ నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, లయన్ కళ్లేపల్లి నారాయణరావు, లయన్ అక్కినేని రాఘవేంద్రరావు, రాగిపిండి లక్ష్మీ రెడ్డి,మూల్పూరి దన కోటేశ్వరరావు,ఎనికేపల్లి నారాయణ,అక్కినేని ఫణీంద్ర, బావిశెట్టి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జంక్షన్ లో అల్లాడశెట్టి ఆధ్వర్యంలో మోహన రంగా 79 వ జయంతి వేడుకలు

## ఆశాజ్యోతి, ప్రజ్వల హోమ్ లో అన్నసమారాదన



**హనుమాన్ జంక్షన్, జూలై 4 (వార్తాప్రభ) :** మహా పురుషుడు, కారణజన్ముడు వంగవీటి మోహన రంగా 79 వ జయంతి హనుమాన్ జంక్షన్ లో సాయినాథ్ హోటల్ అధినేత,జనసేన నాయకులు అల్లాడశెట్టి నాగేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు.ముందుగా పలువురు రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వీట్స్ పంపిణీ చేశారు కూటమినాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరమాచినేని సత్య ప్రసాద్, దయాల రాజేశ్వర రావు, అట్లూరి శ్రీనివాస్, పుషదపు వీర వెంకయ్య, పరుచూరి సుజిని, కొలసాని శివలీల,బండారు లక్ష్మి ప్రసన్న, సింగవరపు సూర్యావతి, వై లలిత కుమారి,మద్దా జయరాణి, గరికపాటి చంటి, వడ్డి శేఖర్, వడ్డి తరుణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మోహన రంగా జయంతిని పురస్కరించుకుని సాయినాథ్ హోటల్ అధినేత అల్లాడశెట్టి నాగేశ్వరావు హనుమాన్ జంక్షన్ లోని ఏలూరు రోడ్ లోని ఆశాజ్యోతి 80 మందికి ,గుడివాడ రోడ్ లోని ప్రజ్వల హోమ్ లోని 60 మంది అనాథలకు విందు భోజనం అందజేశారు,

# పారదర్శక ఓటర్ల జాబితాకు పార్టీల సహకారం!

● దోషరహిత జాబితా లక్ష్యంగా సజావుగా సర్ ప్రక్రియ ● క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు కూడా చేయూతనివ్వాలి ● ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో రెండు హెల్ప్ డెస్కుల ఏర్పాటు ● ప్రజలు బీఎల్‌వోలతో పాటు వీటిని కూడా సద్వినియోగం చేసుకోవాలి ● ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**విజయవాడ, జూలై 4 (వార్తాప్రభ) :** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహిస్తూ దోషరహిత ఓటర్ల జాబితాను రూపొందించడం లక్ష్యంగా కృషిచేస్తున్నామని, ఈ బృహత్తర కార్యక్రమంలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములై సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో సమగ్ర సవరణ ప్రక్రియ నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సర్ ప్రక్రియ తీరుతెన్నులను కలెక్టర్ వివరించారు. 17,13,445 ఓటర్లకు గాను పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు, వాటి డిజిటైజేషన్ తదితరాలను వివరించారు. పార్టీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు https://voters.eci.gov.in/ వెబ్‌సైట్లో సెర్చ్ యువర్ నేమ్ ఇన్ లాస్ట్ ఎస్ఐఆర్ ద్వారా 2002 ఎస్ఐఆర్ జాబితా నుంచి ఓటరు సమాచారం పొందే విధానాన్ని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారాలు నింపే విధానంతో డిజిటైషన్ గురించి వివరించారు. ఓటర్లు ఫారాలు నింపడం, సమర్పించడంలో సహకరించేందుకు జిల్లాలోని 1,792 పోలింగ్ స్టేషన్ల పరిధిలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం, సందేహాల నివృత్తి కోసం ఈ హెల్ప్ డెస్కులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఎల్ఏలు కూడా ప్రక్రియపై ఉన్న అవగాహనతో క్షేత్రస్థాయిలో సహాయసహకారాలు అందించాలన్నారు. ఓటు భద్రత కోసమే ఈ సర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని.. అర్హులైన ప్రతిఒక్కరూ జాబితాలో ఉండేలా స్వచ్ఛమైన జాబితా రూపకల్పనలో సహకరించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సమావేశంలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేసి.. వారి నుంచి సూచనలు స్వీకరించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు పి.హరికృష్ణ (ఏఏపీ), కాకాని తరుణ్ (భాజపా), పి.డేనియల్ (బీఎస్పీ), డీవీ కృష్ణ (సీపీఎం), వై.ఆంజనేయరెడ్డి, జి.సుందర్ పాల్ (వైఎస్ఆర్‌సీపీ) తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎస్.పి కాల్వల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.11.56 కోట్లు మంజూరు చేసింది

● ఎన్ ఎస్ పి ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోటా వీరబాబు ● మైలవరం ఎన్ ఎస్ పి కార్యాలయంలో ● ఎన్ ఎస్ పి ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం







**మైలవరం,జూలై 4 (వార్తాప్రభ) :** ఎన్.ఎస్.పి కాల్వల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.11.56 కోట్లు మంజూరు చేసిందని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోటా వీరబాబు వెల్లడించారు.మైలవరం పట్టణంలోని ఎన్ ఎస్ పి కార్యాలయం సమావేశపు హాలులో శనివారం ఎన్ ఎస్ పి ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోటా వీరబాబు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతాంగం ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ పరిధిలోని ఐదు నియోజకవర్గాలు జగ్గయ్యపేట, నందిగామ,మైలవరం, నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలలో దాదాపు 123 వం-ˇ్కలకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.11.56 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ నిధులు నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.425 కోట్లు మంజూరు చేయగా, దీనిలో ఎన్ఎస్పి ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ పరిధిలో కాలువల ఆధునికీకరణకు రూ.11.56 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.దీనిలో భాగంగా కార్యాచరణ, ప్రణాళికను సిద్ధం చేసుకుని పనులు ప్రారంభించడం కోసం ఎన్ ఎస్ పి ఎస్ఈ రామచంద్రరావు, ఈ ఈ లు శ్రీనివాస్, కిషోర్ స్థానిక డిఈ ప్రభు కుమార్, డిసి చైర్మన్లు తో కలిసి సమావేశం కావడం జరిగిందన్నారు. ఎల్ ని నో దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లడం జరుగుతుందని, ఎక్కడైనా వర్షాభావ పరిస్థితు లు ఎదురైతే ఏ రకంగా అధిగమించాలో ఆలోచన చేస్తున్నామని తెలిపారు.ప్రస్తుతం ఉన్న కాల్వల్లో పూడిక, సిల్ట్ తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేయనున్నట్లు వెల్లడించారు.రానున్న కాలంలో వచ్చే కొద్దిపాటి నాగార్జునసాగర్ జలాలను సక్రమంగా వినియో గించుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా లస్కర్ల కొరత తీవ్రంగా ఉందని, 273 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 33 మంది మాత్రమే ఉన్నారని తెలియజేశారు. లస్కర్ల నియామకాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయడం జరిగిందన్నా రు.కొన్నిచోట్ల ప్రథమ దశలో నిర్మించిన వంతెన (బ్రిడ్జి) లు పూర్తిగా శిథిలమయ్యాయన్నారు. వేంపాడు,మూలపాడు, కంచికచర్ల, కొండపల్లి మేజర్ల మీద ఉన్న బ్రిడ్జి లు శిథిలమయ్యాయని, వీటి స్థానంలో నూతన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టా లని ప్రభుత్వాన్ని కోరుతున్నామని కోట వీరబాబు తెలిపారు.అలాగే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు మొదలుపెట్టి పూర్తి చేయడం ద్వారా ఈ ప్రాంత రైతాంగం సాగునీటి సమస్యలు అధికమించే విధంగా కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఏవైతే ఎత్తిపోతల పథకాలు ఉన్నాయో చివరి ఎత్తిపోతల పథకాలన్నింటికీ సాగునీరు అందే విధంగా వైకుంఠపురం-దోమలూరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కూడా ఈ సభలో తీర్మానం చేయడం జరిగిందని వెల్లడించారు. ఎక్కడైతే ఎన్ ఎస్ పి కాలువలు ఆక్రమణకు గురయ్యా యో వాటిని గుర్తించి ఎన్ ఎస్ పి ఎస్ఈ కి అర్జీ పెడితే తదుపరి ఎస్ఈ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్గా నేను కలిసి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరుగుతుంద ని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రీ సర్వే జరుగుతుం దని దీనిలో భాగంగా ఎన్ఎస్పి కాలువల బౌండరీస్ గుర్తించేలా తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. వచ్చే సర్వసభ్య సమావేశం నాటికి అందరూ డీఈలతో కాల్వల ఆక్రమణలపై ఎంక్వైరీ చేస్తామన్నారు. ప్రాధాన్యత క్రమంలో కాలువలను ఆధునికీకరించడం జరుగుతుందని, ఈ వర్కులన్నీ కూడా రూ.10 లక్షల వరకు నామినేషన్ ప్రాతిపాదికన జరుగుతాయని స్పష్టం చేశారు.

**కృష్ణానది యాజమాన్యం బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలి:**

**-ఎన్ ఎస్ పి ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ**

కృష్ణానది యాజమాన్యం బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ లోని అమరావతికి తరలించాలని ఎప్పటినుంచో అడుగుతున్నామ ని ఎన్ ఎస్ పి ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలియజేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ కమిటీ పరిధిలో 2, 3 జోన్లలోని మైలవరం నందిగామ జగ్గయ్యపేట గన్నవరం నూజివీడు దెందులూరు నియోజకవర్గం 3.67 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, దీనిలో మూడవ జోన్ లో 2.10 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని వెల్లడించారు. ముఖ్యంగా గత సీజన్లో విపరీతంగా వర్షాలు కొనడం వల్ల 32 టిఎంసి లు అలాట్మెంట్ ఉంటే 23 టీఎంసీల సాగునీరు రావడం జరిగిందని తెలిపారు. ఈ నీటిని చివరి ఆయకట్టు వరకు ఇవ్వడానికి ప్రయత్నించామన్నారు. 2025-26 లో నీటి సంఘాల వ్యవస్థ వచ్చిన తర్వాత రూ.3.86 కోట్లతో పనులు చేయడం జరిగిందని, ఆ పనులకు సంబంధించిన పేమెంట్స్ ఇంతవరకు అవ్వలేదు అన్నారు. ఆ మూడు కోట్ల 86 లక్షల రూపాయలు ఇవ్వాలని సమావేశంలో తీర్మానం చేశామన్నారు. నాగర్ సాగర్ ప్రాజెక్టు కింద ఏపీలో 3.67 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే తెలంగాణ రాష్ట్రంలో మిగిలిన 7 లక్షల ఆయకట్టు ఉందన్నారు.ప్రాథమిక స్థాయి లో సాగునీటి సంఘాల అధ్యక్షులను గ్రామ పంచాయతీ సమావేశాలకు ఆహ్వానించాలని, మండల పరిషత్ సమావేశాలకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ లను ఆహ్వానించాలని అలాగే జిల్లాస్థాయి సమావేశాలకు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లను ఆహ్వానించాలని సమావేశంలో తీర్మానం ద్వారా ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. రాష్ట్రం విడిపోయాక 2014-19 లో ఎన్ ఎస్ పి మూడో జోన్ కి గోదావరి జలాలను తీసుకురావాలనుకున్నామని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి 4900 కోట్లు కేటాయించి 70శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 30 శాతం పనులకు గాను ప్రభుత్వం బడ్జెట్లో 430 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు, ప్రభుత్వం త్వరగా ఈ పనులు మొదలుపెట్టి పూర్తిచేయా లని కోరామని తెలిపారు. కమిటీ పరిధిలో ఎన్టీఆర్ కృష్ణ ఏలూరు జిల్లాల్లో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయని, ఆ 17 డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ఏవైతే ఎన్క్రోచ్మెంట్ ఆక్రమణలు ఉన్నాయో వాటిని తొలగించమని ప్రాజెక్టు కమిటీ సమావేశం తీర్మానంలో కోరమన్నారు. కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేసి నవంబర్ 15 నాటికి మూడవ జోన్ కి సాగునీరు అందేలా సాగునీటి సంఘాలు ప్రతినిధులు కృషి చేయాల ని మనవి చేశారు. ఈ సమావేశంలో ఎన్ ఎస్ పి ఏఈ బి.నారాయణ, డీసీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

# కైలాస ధామానికి ప్రీతమ్ రెడ్డి చేయూత

## రూ.5.16 లక్షల విరాళం, రూ.12 లక్షల వైకుంఠ రథం అందజేతకు హామీ



**చంద్రగిరి :జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం జరుగుతున్న కైలాస ధామానికి మరో విశేషమైన చేయూత లభించింది. నరసింగాపురంకు చెందిన మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి తనయుడు రెడ్డివారి ప్రీతమ్ రెడ్డి తరఫున స్థానిక గ్రామస్తులు రూ.5,16,287 నగదును కైలాస ధామం నిర్మాణం కోసం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కైలాస ధామం నిర్మాణానికి తమ కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రీతమ్ రెడ్డి పేర్కొన్నారు.ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకత్వంలో చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని గ్రామస్తులు కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే శాశ్వత మౌలిక వసతుల కల్పనలో భాగంగానే కైలాస ధామం నిర్మాణ పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయని వారు తెలిపారు.ఈ సందర్భంగా ప్రీతమ్ రెడ్డి మరో గొప్ప నిర్ణయాన్ని ప్రకటించారు. తన తాత రెడ్డివారి నాథముని రెడ్డి, నానమ్మ లీలావతమ్మల పవిత్ర స్మారకార్థం సుమారు రూ.10 నుంచి రూ.12 లక్షల విలువైన అత్యాధునిక వైకుంఠ రథాన్ని కైలాస ధామానికి వితరణగా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ రథం ప్రజలకు అవసరమైన సమయంలో గౌరవప్రదమైన అంత్యక్రియల సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.అంతేకాకుండా, భవిష్యత్తులో కైలాస ధామం అభివృద్ధికి అవసరమైన మరిన్ని వసతులు కల్పించేందుకు కార్పొరేట్ సంస్థలతో చర్చలు జరిపి, వారి సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను సమీకరించే దిశగా ప్రత్యేకంగా కృషి చేస్తానని ప్రీతమ్ రెడ్డి వెల్లడించారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో తమ కుటుంబం ఎప్పటికీ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.ప్రీతమ్ రెడ్డి ప్రకటించిన నగదు విరాళం, వైకుంఠ రథం వితరణ హామీపై స్థానికులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కైలాస ధామం నిర్మాణానికి ప్రజల నుంచి లభిస్తున్న విశేష సహకారం ఈ పుణ్యక్షేత్ర అభివృద్ధికి మరింత బలాన్ని చేకూరుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# వర్షపు నీరు నిల్వ లేకుండా గుంతలను పూడ్చాలి



**కోదూరు, జులై 4 (వార్తా ప్రభ):** కోదూరు తూర్పు వైపున ఉన్న ఆర్టీసీ ప్రాంగణంలోని గుంతల రహదారిని తక్షణమే పూడ్చాలని సిపిఎం పార్టీ కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నేతలు గ్రామస్తులతో కలిసి కోదూరు బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా వర్షాకాలంలో ఆర్టీసీ ప్రాంగణం మొత్తం గుంతల మయంగా మారి వర్షపు నీరు నిల్వ ఉండి కోదూరు గ్రామ ప్రజల రోగాలకు కారణం అవుతుందని తక్షణమే ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని బస్టాండ్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించి గుంతలను పూడ్చి రోడ్డు వెయ్యాలన్నారు. అలాగే కోదూరు సెంటర్ నుంచి ఉల్లిపాలెం గ్రామం వరకు ఉన్న ఆర్ అండ్ బి ప్రధాన రహదారి అడుగడుగున గుంటలమయంగా మారిందని నిత్యం విద్యార్థులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తక్షణమే ఆర్ఎంపీ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మరమ్మతు పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కోదూరు మండల కార్యదర్శి పోలాబత్తిన మోహన్ రావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో జూలై 5న మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత గాథపై సంగీత నృత్య నాటకం

**-అశోక్ సామ్రాట్ యాదవ్**



**తిరుపతి, జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో, ఒంగోలు సిందూర కల్చరల్ అసోసియేషన్ కళాకారులచే మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత పోరాటాలను ప్రతిబింబించే "మహాత్మా జ్యోతిరావు పూలే" సంగీత నృత్య నాటకాన్ని జూలై 5వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు అశోక్ సామ్రాట్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బుద్ధుని అనంతరం అఖండ భారతదేశాన్ని ఆవరించిన అజ్ఞానాంధకారాన్ని చీల్చి సామాజిక చైతన్య జ్యోతిని వెలిగించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. శూద్రులు, దళితులు, మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, అస్పృశ్యత, సామాజిక అన్యాయాలపై ఆయన నిరంతరం పోరాడారని, ఆయనకు సహచరిగా సావిత్రిబాయి పూలే మహిళా విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు.పీష్వా పాలకుల నిరంకుశ విధానాలను ధైర్యంగా ఎదుర్కొంటూ అణగారిన వర్గాలకు విద్యను అందించడంలో పూలే దంపతులు చరిత్రాత్మక పాత్ర పోషించారని తెలిపారు. బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించడం, వితంతు వివాహాలు, కులాంతర వివాహాలను ప్రోత్సహించడం వంటి అనేక సామాజిక సంస్కరణలను వారు అమలు చేశారని వివరించారు.పూలే దంపతుల స్ఫూర్తిదాయక జీవన గాథను సుమారు 40 మం కళాకారులతో సంగీతం, నృత్యం, నాటక సమ్మేళనంగా రసరమ్యంగా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, మానవ విలువలను ప్రతిబింబించే ఈ నాటకాన్ని సమతావాదులు, సామాజిక చింతనాపరులు, మేధావులు, కళాభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.ఈ నాటకానికి ప్రముఖ నాటక రచయిత డా. డి. విజయభాస్కర్ రచన అందించగా, డా. పాటిబండ్ల ఆనందరావు దర్శకత్వం వహిస్తున్నారు. ఉన్నం వెంకట శేషయ్య ఆర్గనైజర్‌గా, బాలినేని నాగేశ్వరరావు సహ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సాకం ప్రభాకర్‌తో పాటు సమితి సభ్యులు ఎస్.ఏ. సామ్రాట్ యాదవ్, బి.వి. కేశవులు ఉడయార్, జి. వెంకటరమణ, బి. లక్ష్మయ్య యాదవ్, కే. చంద్రబాబు యాదవ్, ఆర్. సురేష్ బాబు, విడగొట్టి రమణ, ఎస్. రామయ్య ఆచారి, నక్కా భాస్కర్ యాదవ్, వై. విజయలక్ష్మి తదితరులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తిరుపతిలో నేడు మహాత్మా జ్యోతిరావు పూలే నాటకోత్సవాలు



**తిరుపతి, జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత విశేషాలు, ఆయన చేపట్టిన సామాజిక సంస్కరణ ఉద్యమాలు, బీసీలు, దళితులు, మహిళల అభ్యున్నతి కోసం చేసిన విశిష్ట సేవలను ప్రజలకు చేరవేసే ఉద్దేశంతో మహాత్మా జ్యోతిరావు పూలే నాటకోత్సవాలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ యాదవ్ మహాసభ తిరుపతి నగర అధ్యక్షుడు సుబ్బు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 మంది ప్రముఖ కళాకారులు పాల్గొని మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత గాథను సంగీత, నృత్య, నాటక రూపంలో ఆవిష్కరించనున్నారని చెప్పారు. బీసీలు, అణగారిన వర్గాలు, మహిళల సాధికారత కోసం పూలే చేసిన ఉద్యమాలు, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటం, మహిళా విద్యాభివృద్ధికి అందించిన సేవలు, కుల వివక్ష నిర్మూలన కోసం చేసిన త్యాగాలను ఈ నాటకం ద్వారా హృద్యంగా ప్రేక్షకులకు అందించనున్నట్లు వివరించారు.సమాజంలో సమానత్వం, విద్యా చైతన్యం, సామాజిక న్యాయం వంటి విలువలను విస్తృతంగా చాటిచెప్పే ఈ నాటకోత్సవాన్ని ప్రతి ఒక్కరూ తిలకించి స్ఫూర్తి పొందాలని ఆయన కోరారు. ముఖ్యంగా బీసీ సంఘాల నాయకులు, యాదవ్ బంధువులు, సామాజిక ఉద్యమకారులు, విద్యార్థులు, యువత, మహిళలు, పూలే అభిమానులు అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారతీయ యాదవ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్న రామచంద్ర యాదవ్, జిల్లా అధ్యక్షులు అశోక్ సామ్రాట్ యాదవ్, రాష్ట్ర యువ నాయకులు శంకర్ యాదవ్ తరఫున సుబ్బు ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను భావితరాలకు చేరవేసే ఈ నాటకోత్సవానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు

# చల్లని వేళ...వెంకన్న సన్నిధి భక్తజనంతో రద్దీ...





**గుడ్లవల్లేరు:జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండే ఎండలు తగ్గుముఖం పట్టి చల్లగాలులు వీస్తున్న ప్రకృతి రమణీయతలో మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం వేలాది మంది భక్తజనం బారులు తీరటంతో ఆలయ ప్రాంగణమంతా రద్దీగా మారింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

## యశోద లో "గుండె రిథమ్" లోపాలను సరిచేసే అత్యాధునిక

# "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్" సాంకేతికత

**"ఏట్రియల్ ఫైబ్రిలేషన్"తో పాటు ఇతర గుండె రిథమ్ లోపాలతో బాధపడుతున్న 31, 84 ఏళ్ల ఇద్దరు పేషెంట్లకు అత్యాధునిక "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్" చికిత్సతో కొత్త జీవితాన్ని అందించిన యశోద హాస్పిటల్స్ వైద్యులు**





**హైదరాబాద్: జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గుండె రిథమ్ వ్యాధుల చికిత్సలో మరో కీలక మైలురాయిని అధిగమిస్తూ, యశోద హాస్పిటల్స్–సికింద్రాబాద్ లో అత్యాధునిక లి"పల్స్ ఫీల్డ్ అబ్లేషన్" సాంకేతికతను విజయవంతంగా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందుతున్న మెడ్‌ట్రానిక్ అభివృద్ధి చేసిన పల్స్ సెలెక్ట్ "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్" సిస్టం సహాయంతో క్లిష్టమైన గుండె రిథమ్ (గుండె కర్ణికల అసమాన స్పందన) లోపాలతో బాధపడుతున్న 31, 84 ఏళ్ల ఇద్దరు పేషెంట్లకు ఈ అత్యాధునిక విధానాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ అనేది ముఖ్యంగా ఎట్రియల్ ఫైబ్రిలేషన్ గుండె కర్ణికల అసమాన స్పందన వంటి గుండె రిథమ్ లోపాల చికిత్సలో ఉపయోగించే అత్యాధునిక సాంకేతిక విధానం. ఇది నియంత్రిత విద్యుత్ పల్సు ద్వారా గుండెలో అసాధారణ విద్యుత్ సంకేతాలను సృష్టించే కణజాలాన్ని మాత్రమే ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకొని చికిత్స అందిస్తుంది. సాదారణ థర్మల్ అబ్లేషన్ విధానాలతో పోలిస్తే, ఈ సాంకేతికత ద్వారా అన్నవాహిక, ఫ్రెనిక్ నర్వ్ వంటి సమీప అవయవాలకు హాని కలిగే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. ఫలితంగా చికిత్స మరింత సురక్షితంగా ఉండటంతో పాటు, రోగులు త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ అత్యాధునిక సాంకేతికతతో యశోద హాస్పిటల్స్–సికింద్రాబాద్‌లో రెండు క్లిష్టమైన గుండె రిథమ్ లోపాల కేసులకు విజయవంతంగా చికిత్స అందించడం జరిగింది. పదేపదే గుండె దడ, ఆయాసం వంటి లక్షణాలతో బాధపడుతున్న 31 ఏళ్ల యువ రోగిని పరీక్షించగా, అతనికి ఎడమ ఎట్రియల్ టాకికార్డియాతో కూడిన పారాక్సిస్మల్ ఎట్రియల్ ఫైబ్రిలేషన్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అనంతరం అత్యాధునిక విధానాన్ని విజయవంతంగా నిర్వహించగా, చికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకొని, ప్రస్తుతం ఎలాంటి లక్షణాలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారు. అలాగే, తీవ్రమైన ఆయాసం కారణంగా ఇటీవల ఆసుపత్రిలో చేరిన 84 ఏళ్ల వృద్ధ రోగిని పరీక్షించగా, ఆయనకు నిరంతర ఎట్రియల్ ఫైబ్రిలేషన్ ఉన్నట్లు గుర్తించారు. చికిత్స అనంతరం గుండె రిథమ్ సాధారణ స్థితికి చేరుకోవడంతో పాటు ఆరోగ్య పరిస్థితి గణనీయంగా మెరుగుపడి, గుండె స్పందన సాధారణ స్థితికి చేరడంతో స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో డిశ్చార్జ్ చేశారు. ఈ విజయవంతమైన ప్రక్రియను డాక్టర్. ఎం. ఎస్. చంద్రమౌళి, సీనియర్ కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ ఉ హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్లి , యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ ఎలక్ట్రోఫిజియాలజీ బృందంతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్–సికింద్రాబాద్, సీనియర్ కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ ఉ హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్ డాక్టర్. ఎం. ఎస్. చంద్రమౌళి మాట్లాడుతూ "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ గుండె రిథమ్ వ్యాధుల చికిత్సలో ఒక విప్లవాత్మక ముందడుగు అన్నారు. మెడ్‌ట్రానిక్ అభివృద్ధి చేసిన పల్స్ సెలెక్ట్ "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్" సిస్టం ద్వారా అత్యంత ఖచ్చితత్వంతో, మరింత సురక్షితంగా ఎట్రియల్ ఫైబ్రిలేషన్కు చికిత్స అందించగలుగుతున్నాము. ప్రపంచ స్థాయి వైద్య సాంకేతికతను మన దేశ రోగులకు అందుబాటులోకి తీసుకురావడం యశోద హాస్పిటల్స్ లక్ష్యం అన్నారు. ఈ నూతన సాంకేతికత ద్వారా మరింత మెరుగైన ఫలితాలు, అధిక భద్రత మరియు వేగంగా కోలుకునే అవకాశాన్ని రోగులకు అందించవచ్చని డాక్టర్. ఎం. ఎస్. చంద్రమౌళి తెలిపారు.యశోద హాస్పిటల్స్ కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ విభాగంలో ఎట్రియల్ ఫైబ్రిలేషన్, ఇతర గుండె రిథమ్ లోపాలకు సంబంధించిన కాంప్లెక్స్ అబ్లేషన్ విధానాలు, పేస్మేకర్ల అమరిక, ఐ సి డిలు, సిఆర్టి పరికరాలు, లీడ్లెస్ పేస్మేకర్లు, కండక్షన్ సిస్టమ్ పేసింగ్, అలాగే హార్ట్ ఫెయిల్యూర్కు సంబంధించిన అత్యాధునిక చికిత్సలు నిపుణుల పర్యవేక్షణలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# నైపుణ్య అభివృద్ధి కేంద్ర భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జులై 4 (వార్తప్రభ)** మండలం, మల్కాపురం గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన నైపుణ్య అభివృద్ధి కేంద్ర భవనాన్ని శాసనసభ్యులుతెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ముందుగా ఎంపీ లాడ్స్ ద్వారా రూ.30 లక్షల నిధులు మంజూరు చేసిన విజయవాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం యువత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నైపుణ్య శిక్షణా వసతులు కల్పించడం ద్వారా ఆర్థికంగా యువతను బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.మల్కాపురం గ్రామ ప్రజలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామానికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.అనంతరం నైపుణ్య అభివృద్ధి కేంద్ర భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే తాతయ్య , ఈ కేంద్రాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని గ్రామ యువత తమ భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, సొసైటీ చైర్మన్ గణపనేని పిచ్చయ్య, కళ్యాణం భాస్కరరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూసపాటి యలమంద, గుత్తా నాగేశ్వరరావు, అంబోజి విద్యాసాగర్, అత్తులూరి కృష్ణ, గణపనేని గణేష్, నూకపోగు సురేష్, బట్టు వెంకయ్య, గంగవరపు వెంకటేశ్వరరావు, వద్దెపూడి రాజీవ్ గాంధీ, గూటి బాబు, పచ్చిపాల నరసింహారావు, అల్లిక రంగయ్య, అల్లిక ఎర్రమల్లెలు, అల్లిక నాగేశ్వరరావు, లింగనబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఉరిపెట్టుకొని వివాహిత ఆత్మహత్య

**మైలవరం (పుల్లూరు):జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పక్కింటి వాళ్ళు తిట్టారని మనస్థాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలవరం మండలం పుల్లూరు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది.మైలవరం ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం పుల్లూరు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన చల్లా ఏసుబాబు సతీమణి చల్లా తిరుపతమ్మ (21) ఇద్దరూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.అయితే వారిది తాటాకు ఇల్లు కావడంతో ఇంటి పైకప్పు కోసం అని కొత్తగా తాటాకు తెచ్చి ఇంటి వద్ద తాటాకుమండి వేసుకున్నారు. ఆ తాటాకుమండి వల్ల ఎలుకలు ఇంటిలోకి వస్తాయని పక్కింటి వాళ్ళు తిరుపతమ్మ ను తిట్టడంతో మనస్థాపం చెందిన తిరుపతమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి పెట్టుకుని ఆత్మహత్య చెందిందని ఆమె భర్త ఏసుబాబు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలియజేశారు. మృతురాలు తిరుపతమ్మకు ఒక పాప ఉంది. భర్త ఏసుబాబు ఫిర్యాదు మేరకు ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్రోల్మెంట్ ను పెంచి గుణాత్మకమైన విద్యను అందించాలి -డిఈవో ఎల్.చంద్రకళ

**ముగిసిన రెండురోజుల జ్ఞాన జ్యోతి ఇయర్-03 జిల్లా శిక్షణ తరగతులు**



**విజయవాడ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి):** విద్యార్థుల ఎన్రోల్మెంట్ ను పెంచాలని వారికి గుణాత్మకమైన విద్యను అందించాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు.గత రెండు రోజులు గా విజయవాడ గాంధీజీ మున్సిపల్ హై స్కూల్ లో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి ఇయర్–03 జిల్లా శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఆఖరి రోజు శిక్షణ కార్యక్రమానికి విచ్చేసిన డిఈవో చంద్రకళ ప్రసంగిస్తూ అంగన్వాడీ మరియు స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి పార్టిసిపేషన్ చేసిన 120 మంది డిఆర్పి లకు క్షేత్ర స్థాయిలో యాక్టివిటీ మోడ్ లో బోధన చేయాలన్నారు.

# కనీస వేతనం అమలు చేయాలి.....!

## మైలవరంలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ..



**మైలవరం జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి):** పరిశ్రమల్లో పనిచేసేకార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించి జీవోలు విడుదల చేయాలని కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు ఎన్ సిహెచ్. శ్రీనివాస్,ఎ.వెంకటేశ్వరరావు లు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ శనివారం మైలవరం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం సందర్భంగా వారు మాట్లాడుతూ స్కీం వర్కర్లను, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను హరించాలని చూస్తుందని, కార్మికుల హక్కులను కాలరాసి కార్పోరేట్లకు బిజెపి ప్రభుత్వం కొమ్ము కాస్తుందని దుయ్యబట్టారు.కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి ప్రభుత్వాలకు తగినవిధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ సిహెచ్ సుప్రజ, పిల్లి నరసింహారావు, సిహెచ్.సుధాకర్, కార్యదర్శులు కె.గోపాల్, బి వెంకటేశ్వరరావు,ఎ.కమల, పి. అప్పారావు, వివిధ రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల పాత్ర కీలకం

## .. డిసిసిబి చైర్మన్ తుమ్మల



**కాకినాడ, జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని డీసీసీబీ బ్యాంక్ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా సహకార వారోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి హాజరై సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని, రైతులు, మహిళలు, స్వయం సహాయక సంఘాలు, సామాన్య ప్రజలకు మెరుగైన ఆర్థిక సేవలు అందించడంలో సహకార సంఘాల పాత్ర అత్యంత కీలకమన్నారు.సహకార సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందని, సహకార సంస్థలు మరింత బలోపేతం కావడానికి పాలకవర్గ సభ్యులు, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి సహకార సంఘం ఆదర్శవంతంగా నిలిచి రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ కోఆర్డినేటర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు ,డిసిఓ బీ.శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ బ్యాంక్ సీఈఓ ప్రవీణ్ కుమార్,ఇంచార్జి డి.జి.ఎం. ఎలిశెట్టి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు



**జగ్గయ్యపేట జులై 4 (వార్తప్రభ)** ప్రజానాయకుడు, నిరుపేదల హక్కుల కోసం నిరంతరం పోరాడిన దివంగత వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నివాసం నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కోదాడ రోడ్డులో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , శ్రీరాం చిన్నబాబు తెలుగుదేశం పార్టీ కాపు నాయకులతో కలిసి వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజానాయకుడు వంగవీటి మోహన రంగా అని కొనియాడారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల పట్ల ఆయన చూపిన అంకితభావం, ప్రజల కోసం చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల పట్ల నిబద్ధత, ధైర్యసాహసాలు, న్యాయం కోసం రాజీ పడని వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శమని అన్నారు.వంగవీటి మోహన రంగా ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజాసేవే పరమావధిగా భావించి ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య మరియు తెలుగుదేశం పార్టీ కాపు నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వంగవీటి మోహన రంగా గారికి ఘనంగా నివాళులర్పించారు.

# డివిజనల్ పిఆర్ఓ పి.రవికి డిపిఆర్ఓగా పదోన్నతి



**కాకినాడ జులై 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా సమాచార పౌర సంబంధ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న డివిజనల్ పిఆర్ఓ పి. రవి ని డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గా పదోన్నతి కల్పిస్తూ సమాచార శాఖ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిఐపిఆర్ఓ,డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నియమితులై , ప్రస్తుతం కాకినాడ కార్యాలయంలో ప్రత్యేక విధులపై పనిచేస్తున్న ఆయనను డిఐపిఆర్ఓ, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి వారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధ అధికారిగా పదోన్నతిపై నియమించారు. ఈ సందర్భంగా పదోన్నతి ఉత్తర్వులను పి.రవి కి సమాచార శాఖ జోన్–2 జాయింట్ డైరెక్టర్ పి.తిమ్మప్ప అందజేసి శుభకాంక్షలు తెలిపారు. అలాగే కాకినాడ కార్యాలయ అధికారులు సిబ్బంది, పాత్రికేయులు ఆయనకు అభినందలు తెలియజేశారు.